
RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్


తెలుగు దినపత్రిక
ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం
CITIZEN TIMES TELUGU DAILY



VOLUME: 17 | ISSUE: 142 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 19-12-2025 | Pages: 8 | Rs: 2/-
సంపుటి : 17 | సంచిక :142 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 19-12-2025 | పేజీలు : 8 | రూ: 2/-

## 'ఉపాధి' స్థానంలో 'జీ రామ్ జీ'కి లోక్‌సభ ఆమోదం..

బిల్లు ప్రతులు చించేసిన విపక్ష ఎంపీలు



న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' (ఎంజీనరేగా)ను రద్దు చేసి దాని స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చేందుకు ఉద్దేశించిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్' (వీబీ జీ రామ్ జీ) బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం తెలిపింది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాలు పెద్దఎత్తున నిరసన వ్యక్తంచేశాయి. వారి ఆందోళన నడుమ స్పీకర్ ఓటింగ్ నిర్వహించగా.. బిల్లుకు ఆమోదం లభించింది. ఈ సమయంలో విపక్ష ఎంపీలు వెల్‌లోకి వచ్చి నిరసన చేపట్టాయి. కొందరు ప్రతిపక్ష నేతలు 'వీబీ జీ రామ్ జీ' బిల్లు ప్రతులను చించి విసిరేశారు. ఈ గందరగోళం నేపథ్యంలో లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడింది. అంతకుముందు బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాల ఆరోపణలకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ బదులిచ్చారు. మహాత్మాగాంధీ సిద్ధాంతాలకు అనుగుణంగానే మోదీ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. "బాపూ సిద్ధాంతాలను కాంగ్రెస్ సర్కారు చంపేసింది. కానీ, ఎన్డీయే ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తోంది. పీఎం ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, స్వచ్ఛభారత్ మిషన్, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలతో గాంధీజీ కలలను తరువాయి 2లో..



## సీఎం చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు

- తనకు ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడంపై సీఎం చంద్రబాబు స్పందన
- 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్'గా ఎంపికైన చంద్రబాబు
- ఈ పురస్కారం ఏపీ ప్రజల కష్టానికి దక్కిన ఫలితమన్న సీఎం
- పెట్టుబడులకు ఏపీ అగ్రగామి అనడానికి ఇది నిదర్శనమని వ్యాఖ్య
- సంస్కరణల వృద్ధిని నమ్మిన ప్రతి ఒక్కరికీ ఈ అవార్డు అంకితమని ప్రకటన
- సీఎం చంద్రబాబుకు ప్రతిష్ఠాత్మక అవార్డు... అభినందించిన పవన్ కల్యాణ్
- సీఎం చంద్రబాబుకు ప్రతిష్ఠాత్మక అవార్డు.. హర్షం వ్యక్తం చేసిన మంత్రి లోకేశ్

అమరావతి, సిటిజన్ టైమ్స్

ఏపీ సీఎం చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు లభించింది. ప్రముఖ ఆంగ్ల మీడియా సంస్థ 'ఎకనమిక్ టైమ్స్' ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ మేరకు ఏపీ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్'లో వెల్లడించారు. "చంద్రబాబుకు ఈ అవార్డు రావడం రాష్ట్రానికి గర్వకారణం. రాష్ట్రంతో పాటు మా కుటుంబానికి ఇది ఎంతో ప్రతిష్ఠాత్మకం. సంస్కరణలను చంద్రబాబు ధైర్యంగా ముందుకు తీసుకెళ్లారని జ్యూరీ ప్రశంసించింది. పాలనలో సంస్కరణలు, వేగం, విశ్వాసంపై చూపిన నిబద్ధతకి ఈ అవార్డు నిదర్శనం. రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు నాయకత్వం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తోంది. పెట్టుబడుల ఆకర్షణ, సంస్కరణాత్మక పాలనకు సీఎం స్ఫూర్తిగా నిలుస్తున్నారు" అని లోకేశ్ పేర్కొన్నారు. ప్రముఖ మీడియా సంస్థ ఎకనామిక్ టైమ్స్ (ఈటీ) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్' పురస్కారాన్ని ప్రకటించడం తెలిసిందే. 'ఈటీ అవార్డ్స్ ఫర్ కార్పొరేట్ ఎక్సలెన్స్' కార్యక్రమంలో భాగంగా చంద్రబాబును ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డు రావడం పట్ల ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఇది తన వ్యక్తిగత కృషికి మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అపారమైన సామర్థ్యానికి, రాష్ట్ర ప్రజల కఠోర శ్రమకు దక్కిన గుర్తింపు అని వినమ్రంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు సోషల్ మీడియాలో స్పందిస్తూ, "ఎకనామిక్ టైమ్స్ నాకు ఈ పురస్కారాన్ని అందించినందుకు ధన్యవాదాలు. ఈ గుర్తింపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక బలమైన సానుకూల సంకేతం. పెట్టుబడులకు ఏపీ అగ్రగామి గమ్యస్థానం అనడానికి ఈ అవార్డు ఒక బలమైన నిదర్శనం. రాష్ట్రానికి అంబాసిడర్‌గా ఉన్నందుకు నేను గర్వపడుతున్నాను" అని తెలిపారు. రాష్ట్రంలో సంస్కరణల ద్వారా అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు తాము చేస్తున్న ప్రయత్నాలకు ఈ పురస్కారం ఒక గొప్ప ప్రోత్సాహం అని ఆయన అభిప్రాయపడ్డారు. పెట్టుబడులు, అభివృద్ధి అనేవి సంక్షేమానికి, యువతకు అవకాశాల కల్పనకు, సమ్మిళిత వృద్ధికి కేంద్ర బిందువులని చంద్రబాబు పునరుద్ఘాటించారు. తమ సంస్కరణల ప్రయత్నాలను గుర్తించిన ఎకనామిక్ టైమ్స్ జ్యూరీ సభ్యులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "ఈ గౌరవం ఆంధ్రప్రదేశ్ ప్రజలకే దక్కుతుంది. సంస్కరణల ఫలాలపై నమ్మకం ఉంచిన ప్రతి పారిశ్రామికవేత్తకూ ఇది చెందుతుంది" అని తరువాయి 2లో..

## ఒమన్ చేరుకున్న ప్రధాని మోదీ



*మస్కట్‌లో బుధవారం తనకు స్వాగతం పలికిన కళాకారులతో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ*

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇథియోపియా పర్యటనను ముగించుకొని బుధవారం ఒమన్ చేరుకున్నారు. ఉప ప్రధాని (రక్షణ వ్యవహారాలు) సయ్యిబ్ షిహాబ్ బిన్ తారిక్ తరువాయి 2లో..

## సిడ్నీ ఉగ్ర దాడి ఘటన.. దర్యాప్తులో భారత బృందం..



న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

ఆస్ట్రేలియాలో మారణహోమం సృష్టించిన ఉగ్రవాది సాజిద్ అక్రమ్ (50)ను హైదరాబాదీగా గుర్తించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉగ్రదాడి దర్యాప్తులో ఆస్ట్రేలియా అధికారులకు సాయం చేసేందుకు ఓ బృందాన్ని అక్కడికి పంపించాలని నిర్ణయించుకున్నట్లు తరువాయి 2లో..

## 2029 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతం

సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, సిటిజన్ టైమ్స్

మూడు దశల్లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అద్భుతమైన ఫలితాలను సాధించిందని.. 2029 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతమవుతాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పార్టీ విజయం కోసం కష్టపడిన కాంగ్రెస్ కార్యకర్తలందరికీ ధన్యవాదాలు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులతో కలిసి సీఎం మాట్లాడారు. "రాష్ట్రంలోని 12వేలకు పైగా గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగాయి. ఎన్నికలు సజావుగా నిర్వహించిన అధికారులకు అభినందనలు. 12,702 పంచాయతీలకు గాను 7,527 చోట్ల కాంగ్రెస్, 808 స్థానాల్లో కాంగ్రెస్ రెబల్స్ ఈ ఎన్నికల్లో గెలుపొందారు. మొత్తానికి 8,335 పంచాయతీలు.. 66 శాతం ఫలితాలను కాంగ్రెస్, కాంగ్రెస్ రెబల్స్ సాధించారు. భారత రాష్ట్ర సమితి, భాజపా ఒక కూటమిగా ఈ ఎన్నికల్లో పోటీచేసి 3511 బీఆర్ఎస్, 710 భాజపా గెలుపొందాయి. బీఆర్ఎస్, భాజపా కూటమి మొత్తం 4,221 పంచాయతీలు (33శాతం) గెల్చుకున్నాయి. దాదాపు 146 గ్రామ పంచాయతీలు (ఒక శాతం) సీపీఐ, సీపీఎం, ఇతరులు గెల్చుకున్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన తర్వాత జరిగిన ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలు మా రెండేళ్ల పాలనపై తీర్పుగా భావిస్తున్నాం. 94 శాసనసభ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగితే 87 తరువాయి 2లో..



## కాలుష్యంపై ఢిల్లీ ఉక్కుపాదం..

- ఢిల్లీలోకి బీఎస్-6 ఇంజిన్ లేని వాహనాల ప్రవేశంపై నిషేధం
- పీయూసీ సర్టిఫికెట్ లేని వాహనాలకు పెట్రోల్ నిలిపివేత
- నిబంధనల అమలుకు 126 చెక్‌పోస్టులు, ప్రత్యేక బృందాలు
- పాఠశాలలు, కార్యాలయాలపై కూడా ఆంక్షలు అమలు

### నేటి నుంచి కొత్త నిబంధనలు

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

దేశ రాజధాని ఢిల్లీలో ప్రమాదకర స్థాయికి చేరిన వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) స్టేజ్-4 ఆంక్షల్లో భాగంగా బీఎస్-6 ప్రమాణాలు లేని ఇంజిన్ వాహనాలు గురువారం నుంచి ఢిల్లీలోకి ప్రవేశించకుండా నిషేధం విధించింది. అంతేకాకుండా, పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పీయూసీ) సర్టిఫికెట్ లేని వాహనాలకు పెట్రోల్ బంకుల్లో ఇంధనం నింపవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయంతో ఢిల్లీ సరిహద్దు నగరాలైన గురుగ్రామ్, ఘజియాబాద్, ఫరీదాబాద్, తరువాయి 2లో..

## భూవివాదాల్లో నేతల జోక్యం ఉంటోందన్న పవన్...



- ఎట్టిపరిస్థితుల్లోనూ సహించవద్దన్న చంద్రబాబు
- రెండో రోజు కలెక్టర్ల సదస్సులో భూ వివాదాలపై కీలక చర్చ
- 22ఏ భూముల సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం ఆదేశం
- విశాఖ భూ దందాల్లో రాజకీయ నేతల జోక్యంపై పవన్ కళ్యాణ్ ప్రస్తావన
- భూ కబ్జాలపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్లు, ఎస్పీలకు చంద్రబాబు సూచన
- భూ రికార్డుల డిజిటలైజేషన్, పాస్ పుస్తకాల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని నిర్ణయం తరువాయి 2లో..

## ఉపాధి హామీ చట్టం రద్దు..

### కొత్త బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం స్థానంలో కొత్త బిల్లు
- 'వీబీ జీ రామ్ జీ' బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- విపక్షాల తీవ్ర నిరసనల మధ్య మూజువాణి ఓటుతో ఆమోదం

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం తరువాయి 2లో..



## ఎడిటోరియల్

# జగన్ మురిపెం... బాబు మమేకం...

జనాలు కొలమానం అన్నది ఓల్డ్ ట్రెండ్ అని అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఒక నాయకుడికి జనాలు రావడం అన్నది విజయానికి ఏ మాత్రం కొలమానం కాదని స్పష్టంగా చెప్పేస్తున్నారు. జనాలు రావడం అన్నది ఈ రోజులలో పెద్దగా లెక్కించాల్సిన విషయం కానే కాదని అంటున్నారు ఆ మాటకు వస్తే ఎవరి సభలకు జనాలు రావడం లేదు అన్న ప్రశ్న ఉంది. ఎక్కువ తక్కువలలో అంతా జనాలతోనే ఉంటారు. ఇక 2024 ఎన్నికలు చూసినా దానికి ముందు ఎన్నికలు చూసినా జనాలు ఏపీలో అన్ని పార్టీల వెంటా కనిపించారు. ముఖ్యంగా చంద్రబాబు సభలకూ అలాగే జగన్ సభలకూ పవన్ సభలలూ విరగబడి వచ్చారు. కానీ రిజల్ట్ మాత్రం వేరేగా వచ్చింది. దాంతో జనాలు పారామీటర్ కానే కాదని విశ్లేషకులు తేల్చేస్తున్నారు. ఇక చూస్తే వైసీపీ అధినేత జగన్ ఎక్కడికి వెళ్ళినా జనాలు వస్తున్నారు. దాంతో ఆయన బాగా సంతోషిస్తున్నారు అని అంటున్నారు. వైసీపీ అయితే ఇక అధికారం మాదే అని ధీమా ప్రదర్శిస్తోంది. జగన్ కి జనాలు రావడం 2024 లోనూ జరిగింది, దానికి ముందూ జరిగింది అన్న సత్యాన్ని మాత్రం వైసీపీ నేతలు గుర్తించడం లేదా అన్న ప్రశ్న కూడా వస్తోంది. వస్తున్న జనాలను చూసి గెలుపు అని వైసీపీ మురుస్తూంటే టీడీపీ కూటమి వేరే విధంగా ఆలోచిస్తోంది అని అంటున్నారు. ఇక కూటమి అధికారలోకి వచ్చాక ఒక విషయం ఆలోచిస్తే కనుక చంద్రబాబు పవన్ లోకేష్ ముగ్గురూ నిరంతరం జనంలోనే ఉంటున్నారు వారితోనే మమేకం అవుతున్నారు. పెద్ద సభల నుంచి చిన్న సమావేశాలు అలాగే ముఖాముఖీలు ఇలా ఏదో ఒక కార్యక్రమం పెట్టుకుని జనం వద్దకు వెళ్తున్నారు. ఈ మధ్యనే మెగా డీఎస్సీ పేరుతో నియామక పత్రాలు వేలాది మంది మధ్యన అందించారు. తాజాగా పోలీస్ కానిస్టేబుళ్ళకు నియామక పత్రాలను అందించారు. అది కూడా బాగానే సభ నిర్వహించి చేపట్టారు. ఇక చంద్రబాబు ఆలోచనలు చూస్తే తామంతా గ్రౌండ్ లోనే ఉంటే కనుక జగన్ సభలకు జనాలు వచ్చినా పెద్దగా పట్టింపు ఉండదన్నది. జగన్ ఎక్కడికి వెళ్ళినా జనాలు వస్తున్నారు, అయితే వైసీపీ నుంచి ఏ రకమైన హామీ వారికి లభిస్తోంది అన్నది కూడా విశ్లేషిస్తున్నారు. అదే సమయంలో టీడీపీ తాము చేసినది చెబుతోంది. చేయాల్సింది కూడా చెబుతోంది, సమస్యలను సైతం పరిష్కరించేందుకు చూస్తోంది. దాంతో జనాలతో మమేకం అయితే కూటమి ప్రభుత్వం వల్లనే పనులు అవుతాయన్న సందేశాన్ని బలంగా జనంలోకి పంపిస్తున్నారు అని అంటున్నారు. సాధారణంగా అధికారంలో ఉన్న వారు జనంలోకి పెద్దగా రారు కానీ కూటమి ప్రభుత్వం మాత్రం ఎపుడూ ప్రజలలో ఉండేందుకు చూస్తోంది. తాను మాత్రమే కాదు అధికారులను ప్రజా ప్రతినిధులను ఇలా గ్రామ స్థాయి వరకూ ఉన్న క్యాడర్ ని ప్రభుత్వం యంత్రాంగాన్ని కూడా జనంలో ఉంచి పాలన వారికి కళ్ళకు కట్టి చూపించాలని ప్రయత్నిస్తోంది. ఈ విధంగా చేయడం వల్ల సమస్యలు ఉన్నా కూడా వారు తమ వైపే చూస్తారు అని తమకే చెప్పుకుంటారన్నది కూటమి పెద్దల ఆలోచనగా ఉంది. అదే సమయంలో జగన్ వెంట జనాలు వచ్చినా ఆయనను చూసేందుకు మాత్రమే పరిమితం అవుతారని, అలాగే ఆ విషయాన్ని రాజకీయంగానూ పరిమితం చేస్తూ పెద్దగా ప్రభావం లేకుండా చూడాలన్న వ్యూహంతోనే కూటమి పార్టీలు ముందుకు కదులుతున్నారు అంటున్నారు. మొత్తం మీద ఇక్కడ తేలేది ఏమిటి అంటే జగన్ కానీ వైసీపీ కానీ వస్తున్న జనాలను చూసి మురిసిపోతే ముప్పే అన్నది కూటమి నయా స్ట్రాటజీలను అర్థం చేసుకోవాలని అంటున్నారు.

# సీఎం చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు

ఆయన పేర్కొన్నారు. తనకు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా చంద్రబాబు ధన్యవాదాలు తెలియజేశారు.

**సీఎం చంద్రబాబుకు ప్రతిష్ఠాత్మక అవార్డు...**
**అభినందించిన పవన్ కల్యాణ్**

ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ది ఎకనామిక్ టైమ్స్' అందించే ప్రతిష్ఠాత్మక 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్' పురస్కారం ఏపీ సీఎం చంద్రబాబుకు లభించడం పట్ల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. చంద్రబాబును ఒక దార్శనిక నేతగా పవన్ కల్యాణ్ అభివర్ణించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, ఐటీ, గ్రీన్ ఎనర్జీ రంగాలను ప్రోత్సహించడం, పాలనలో సంస్కరణలు తీసుకు రావడంలో ఆయన చూపిన చొరవ, కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆయన చేపట్టిన కార్యక్రమాలు 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్య సాధనకు మార్గం సుగమం చేస్తున్నాయని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రం, దేశం అభివృద్ధి పథంలో పయనించేందుకు చంద్రబాబు చేస్తున్న కృషికి మరింత శక్తి చేకూరాలని ఆకాంక్షిస్తున్నట్లు పవన్ కల్యాణ్ తన సందేశంలో తెలిపారు. ఆయన మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు.

**సీఎం చంద్రబాబుకు ప్రతిష్ఠాత్మక అవార్డు..**
**హర్షం వ్యక్తం చేసిన మంత్రి లోకేశ్**

సీఎం చంద్రబాబుకు ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది. ప్రముఖ వాణిజ్య పత్రిక 'ది ఎకనమిక్ టైమ్స్' ఆయన్ను 'బిజినెస్ రీఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డుతో సత్కరించింది. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. ఈ అవార్డు రావడంపై లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. "ఇది మా కుటుంబానికే కాకుండా ఆంధ్రప్రదేశ్‌కు కూడా గర్వకారణమైన క్షణం. భారత సంస్కరణల ప్రయాణాన్ని ఇంత స్పష్టత, ధైర్యం, స్థిరత్వంతో ముందుకు నడిపించిన నాయకులు కొందరే ఉంటారు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంస్కరణలు, పాలనా వేగంపై ఉన్న నమ్మకానికి ఈ అవార్డు ఒక నిదర్శనమని లోకేశ్ అభిప్రాయపడ్డారు. చంద్రబాబు దార్శనికతకు, ఆయన అమలు చేసిన సంస్కరణలకు జాతీయ స్థాయిలో లభించిన ముఖ్యమైన గుర్తింపుగా ఈ పురస్కారాన్ని పలువురు అభివర్ణిస్తున్నారు.

# 2029 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతం

నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఆధిక్యం సాధించింది. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే పెద్దల సూచనను పాటిస్తాం. కానీ, ప్రతిపక్షంలో ఉన్న వారికి ఇంకా అహంకారం తగ్గలేదు. ఇప్పటికైనా ప్రజా తీర్పును గౌరవించి.. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు సహకరించాలి. పేదలకు మేం అందిస్తున్న సంక్షేమ పథకాలే మా విజయానికి కారణం. ఈ ఫలితాలను చూసి భారత రాష్ట్ర సమతి నేతలు అద్భుతం అంటున్నారు. సంతోషం.. మీరు కోరుకున్నట్టే ఈ అద్భుతం 2029లో కూడా జరుగుతుంది. 2/3 మెజార్టీతో 2029లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తుంది. 1/3తో భారత రాష్ట్ర సమితి ఉంటే.. 2/3 మెజార్టీతో కాంగ్రెస్ ఉంటుంది. ఈ తీర్పు 2029లో కూడా పునరావృతం కాబోతోంది" అని సీఎం అన్నారు.

# కాలుష్యంపై ఢిల్లీ ఉక్కుపాదం..

నోయిడా నుంచి రోజూ రాకపోకలు సాగించే సుమారు 12 లక్షల వాహనాలపై ప్రత్యక్ష ప్రభావం పడనుంది. ఇందులో ఘజియాబాద్ నుంచి 5.5 లక్షలు, నోయిడా నుంచి 4 లక్షలు, గురుగావ్ నుంచి 2 లక్షల వాహనాలు ఉన్నట్లు అంచనా. ఈ నిబంధనలను పక్కాగా అమలు చేసేందుకు ప్రభుత్వం 126 చెక్‌పోస్టుల వద్ద 580 మంది పోలీసు సిబ్బందిని, 37 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను మోహరించింది. పెట్రోల్ బంకుల వద్ద పీయూసీ నిబంధనను పర్యవేక్షించేందుకు రవాణా, మున్సిపల్, ఆహార శాఖల అధికారులను నియమించారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా పీయూసీ లేని వాహనాలను సులభంగా గుర్తించనున్నారు. శీతాకాలంలో ఢిల్లీ కాలుష్యంలో వాహనాల వాటా 25 శాతం వరకు ఉంటోందని అధ్యయనాలు తేల్చడంతో ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఢిల్లీలో ప్రాథమిక పాఠశాలలకు ప్రత్యక్ష తరగతులను నిలిపివేయగా, కార్యాలయాలు 50 శాతం సిబ్బందితో పనిచేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. కాగా, బుధవారం సాయంత్రం ఢిల్లీ గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 334గా 'చాలా పేలవం' కేటగిరీలో నమోదైంది. ఇదే అంశంపై ఇవాళ లోక్‌సభలో చర్చ జరగనుండగా, కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ సమాధానం ఇవ్వనున్నారు.

# భూవివాదాల్లో నేతల జోక్యం ఉంటోందన్న పవన్...

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

రాష్ట్రంలో ప్రజలను తీవ్రంగా వేధిస్తున్న భూ వివాదాల శాశ్వత పరిష్కారంపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. కలెక్టర్ల సదస్సు రెండో రోజున భూ సంబంధిత అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఈ సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మందిని ఇబ్బందులకు గురిచేస్తున్న 22ఏ భూముల వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలని, వచ్చే కలెక్టర్ల సమావేశంలో ఇదే మొదటి అజెండాగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విశాఖపట్నంలోని కొన్ని భూ వివాదాల్లో కొందరు రాజకీయ నాయకుల ప్రమేయం ఉంటోందంటూ తన దృష్టికి వచ్చిన ఫిర్యాదుల గురించి ప్రస్తావించారు. దీనిపై తక్షణమే స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, భూ వివాదాల్లో రాజకీయ నాయకుల జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించవద్దని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు గట్టిగా ఆదేశాలు జారీ చేశారు. అలాంటి ఫిర్యాదులు పునరావృతం కాకూడదని, భూ కబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని, అవసరమైతే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరించాలని తేల్చి చెప్పారు. విశాఖ, అనకాపల్లి సహా మరికొన్ని జిల్లాల్లో భూ కబ్జాలు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు.

**గత పాలనలో రికార్డులు అస్తవ్యస్తం**

గత ఐదేళ్ల పాలనలో (2019–24) భూ రికార్డుల వ్యవస్థను పూర్తిగా అస్తవ్యస్తం చేశారని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అత్యుత్తమంగా నిర్వహించిన రెవెన్యూ రికార్డులను గందరగోళంలోకి నెట్టారని అన్నారు. ప్రజలకు చెందాల్సిన భూములను దక్కకుండా చేసేందుకు, వాటిని వివాదాల్లోకి నెట్టేందుకు ఉద్దేశపూర్వకంగా 22ఏ జాబితాలో చేర్చారని విమర్శించారు. దీనివల్లే ప్రస్తుతం ప్రజా సమస్యల పరిష్కార వేదికలకు వచ్చే ఫిర్యాదుల్లో అత్యధికం భూ సంబంధిత సమస్యలే ఉంటున్నాయని పేర్కొన్నారు. భూ సమస్యలను వంద శాతం పరిష్కరించి, ప్రజలకు సక్రమంగా డాక్యుమెంట్లు అందించాల్సిన పూర్తి బాధ్యత కలెక్టర్లదేనని పునరుద్ఘాటించారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా జాయింట్ కలెక్టర్లకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు.

**రికార్డుల ప్రక్షాళన, డిజిటలైజేషన్‌కు చర్యలు**

భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత తీసుకువచ్చేందుకు అన్ని రిజిస్ట్రేషన్, ఆస్తి పత్రాలను డిజిటలైజేషన్ చేస్తున్నామని సీఎం వివరించారు. లింక్ డాక్యుమెంట్లను కూడా డేటా వేర్‌హౌస్‌లో భద్రపరుస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలను వెంటనే జారీ చేయాలని, ఇకపై ప్రింటింగ్ అయిన చోట నుంచే నేరుగా రైతులకు చేరేలా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా, రిజిస్ట్రేషన్ చేసుకున్న డాక్యుమెంట్లు కూడా నేరుగా యజమానుల ఇళ్లకే చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. 20–30 ఏళ్లుగా ఇళ్లలో నివసిస్తున్న వారికి పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. చివరగా, జిల్లాల వారీగా రెవెన్యూ రాబడులపై దృష్టి సారించాలని, పన్ను ఎగవేతలు, మానిప్యులేషన్ జరగకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రం ఒక్కరోజు కూడా ఆదాయం కోల్పోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. మొత్తంగా, భూ వివాద రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# నియోజకవర్గంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి వినతి.

**అమరావతి (సిటిజన్ టైమ్స్) డిసెంబర్ 18**

కోవూరు నియోజకవర్గంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి లక్ష్యంగా ఉన్న అంశాలపై కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అమరావతి సచివాలయంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా ఇందుకూరుపేటలోని ఎం.కె.ఆర్ హైస్కూల్ ఆవరణలో ఉన్న 5.70 ఎకరాల భూమిలో రూ.400 లక్షల అంచనా వ్యయంతో సమగ్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ క్రీడా సముదాయం ద్వారా గ్రామీణ ప్రాంత యువతకు ఆధునిక క్రీడా సదుపాయాలు అందుబాటులోకి వచ్చి, క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. అదేవిధంగా గతంలో మంజూరైనప్పటికీ ఇప్పటివరకు పూర్తి కాకుండా నిలిచిపోయిన విడవలూరులోని ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం, కొడవలూరులోని ఏపీటిడబ్ల్యుఆర్ఐఈఎస్ పాఠశాలలో స్టేడియం, ఆట మైదానాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. పనుల ఆలస్యం వల్ల విద్యార్థులు, యువ క్రీడాకారులు ఇబ్బందులు



ఎదుర్కొంటున్నారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.

## మొదటి పేజీ తరువాయి

# 'ఉపాధి' స్థానంలో 'జీ రామ్ జీ'కి లోక్‌సభ ఆమోదం..

మేం సాకారం చేస్తున్నాం" అని తెలిపారు.

**ఎన్నికల కోసమే గాంధీ పేరు చేర్చి..**

ఈ సందర్భంగా గత కాంగ్రెస్ పాలనపై ఆయన విరుచుకుపడ్డారు. "తొలుత ఉపాధి హామీ పథకానికి %శ్రీప్త్రజూస్త్రజు% అనే పేరు ఉండేది. ఆ తర్వాత 2009లో లోక్‌సభ ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించేందుకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకానికి మహాత్మాగాంధీ పేరు చేర్చింది. అంతేకాదు.. వారి హయాంలో ఈ పథకం అమలులో అనేక లోటుపాట్లు చోటుచేసుకున్నాయి. కూలీలపై ఎక్కువ ఖర్చు చేసి.. మెటీరియల్ కొనుగోలుకు తక్కువ వెచ్చించారు" అని చౌహన్ మండిపడ్డారు. పేరు మార్పుపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ విమర్శలను ప్రస్తావిస్తూ.. గతంలోనే అనేక పథకాలకు కాంగ్రెస్ గాంధీ–నెహ్రూ పేర్లు పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. పల్లె ప్రాంత నిరుపేదలకు ఉపాధి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిర ఆస్తుల కల్పన, వనరుల ఉత్పాదకత, అభివృద్ధి లక్ష్యాలుగా దాదాపు రెండు దశాబ్దాల కిందట 'ఎన్ఆర్ఈజీఏ' చట్టాన్ని 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చింది. తర్వాత 2009లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంగా పేరు మార్చారు.

# ఒమన్ చేరుకున్న ప్రధాని మోదీ

అల్ సయిద్‌తో సమావేశమై పలు ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలపై చర్చించారు. ఇరు దేశాల మధ్య ఉన్న మైత్రీ బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా సమాలోచనలు జరిపారు. భారత్–ఒమన్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లవుతుండటాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన ఓ ఎగ్జిబిషన్‌ను మోదీ తిలకించారు. ఆయన ఒమన్‌లో పర్యటించడం ఇది రెండోసారి. ఈ పర్యటనలో భాగంగా ఒమన్ సుల్తాన్ తారిక్‌తో ప్రధాని భేటీ అవుతారు. భారత సంతతి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. మోదీ పర్యటనలో ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశాలు ఉన్నాయి.

# సిడ్నీ ఉగ్ర దాడి ఘటన.. దర్యాప్తులో భారత బృందం..

తెలుస్తోంది. ఈ మేరకు మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఉగ్రదాడి నిందితుల్లో ఒకరైన సాజిద్ భారత పాస్‌పోర్టును కలిగి ఉండటంతో పాటు నాలుగేళ్ల క్రితం అతడు ఇక్కడికి వచ్చినట్లు తెలంగాణ డీజీపీ కార్యాలయం పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే దర్యాప్తులో భాగం కావాలని భారత్ భావిస్తోందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ దర్యాప్తు బృందంలో రాష్ట్ర పోలీసు విభాగాలు, కేంద్ర నిఘా సంస్థలకు చెందిన అధికారులు ఉంటారని వెల్లడించాయి. యూదులను లక్ష్యంగా చేసుకొని హింసకు పాల్పడిన వ్యక్తి నేపథ్యం, చేసిన ప్రయాణాల గురించి తెలుసుకునేందుకు ఆస్ట్రేలియా అధికారులతో కలిసి పని చేయనున్నట్లు తెలిపాయి. నాలుగేళ్ల క్రితం నిందితుడు తన తల్లిని కలిసేందుకు చేసిన భారత పర్యటనపై కూడా దృష్టిసారించనున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. భారత్‌కు వచ్చిన ఉద్దేశం, వెళ్లిన ప్రదేశాలు, కలిసిన వ్యక్తుల గురించి దర్యాప్తు బృందం తెలుసుకోనుందట. నిందితుడికి ఉగ్రవాద సంస్థలతో ఎలాంటి సంబంధాలు ఉన్నాయనే దానిపైనా దృష్టి సారించినట్లు సమాచారం. భారత్‌లో అతడికున్న పరిచయాలు, స్లీపర్ సెల్స్ ఎవరినైనా నియమించాడా అనే కోణంలో కూడా విచారణ జరపనున్నట్లు తెలుస్తోంది. అక్రమ్‌కు సంబంధించిన ఆన్‌లైన్ కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలపై భారత దర్యాప్తు ఏజెన్సీలు ఇప్పటికే దృష్టిపెట్టాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగానే ఈ దర్యాప్తులో పాల్గొనడం అవసరమని అధికార వర్గాలు తెలిపాయి. సిడ్నీలోని బోండీ బీచ్‌లో ఆదివారం యూదులు 'హనుక్కా ఉత్సవం చేసుకుంటుండగా ఈ ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. సాజిద్ అక్రమ్, అతడి కుమారుడు నవీద్ అక్రమ్‌లు విచక్షణారహితంగా కాల్పులకు పాల్పడ్డారు. ఈ సమాచారమందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని ఎదురుకాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో సాజిద్ హతమవగా.. నవీద్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరికి ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా(ఐసిస్)తో సంబంధాలున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు.

# ఉపాధి హామీ చట్టం రద్దు..

ప్రవేశపెట్టిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్–గ్రామీణ్' (వీబీ జీ రామ్ జీ) పేరుతో రూపొందించిన ఈ బిల్లుపై గురువారం సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పలువురు ఎంపీలు స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లారు. కొందరు ప్రతిపక్ష సభ్యులు బిల్లు ప్రతులను చించి సభలో విసిరేశారు. విపక్షాల ఆందోళనలు, నినాదాల నడుమనే స్పీకర్ ఓటింగ్ నిర్వహించగా.. మూజువాణి ఓటుతో బిల్లు నెగ్గినట్లు ప్రకటించారు. ప్రతిపక్షాల నిరసనలతో సభలో తీవ్ర గందరగోళ పరిస్థితులు ఏర్పడటంతో, స్పీకర్ లోక్‌సభను రేపటికి వాయిదా వేశారు. ఈ కొత్త చట్టం ద్వారా గ్రామీణ ఉపాధి వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# బీచ్ ప్రాంతాలలో రాత్రి పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలను పరిశీలించిన మేయర్

**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్, డిసెంబర్ 18**

బీచ్ ప్రాంతాలలో రాత్రి పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహించరాదని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి ఆయన సాగర్ నగర్, ఆర్కే బీచ్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు తోపాటు విద్యుత్ దీపాలను జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్, జోనల్ కమిషనర్లు ఇప్పి నాయుడు, శివప్రసాద్ లతోపాటు పర్యవేక్షక ఇంజనీరు శాంతిరాజ్ తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖ నగరాన్ని ఆర్థిక రాజధానిగా ప్రకటించి అనేక ఐటి కంపెనీలను నెలకొల్పుతున్నారని, ఇటువంటి నగరానికి ఎంతోమంది సందర్శకులు, పర్యాటకులు, అతిథులు వస్తారని వారికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు నిరంతరం జీవీఎంసీ యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి పారిశుద్ధ్య మెరుగుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా రాత్రి పారిశుద్ధ్య పనులను సాగర్ నగర్, ఆర్కే బీచ్ తదితర ప్రాంతాల్లో పరిశీలించడం జరిగిందని మేయర్ తెలిపారు. రాత్రి పారిశుధ్య





కార్మికుల హాజరు నూరు శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే బీచ్ లో గజఈతగాలు రాత్రి పూట ఎక్కువ సమయం విధుల్లో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే సాగర్ నగర్ ఆర్కే బీచ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ వెలుగులు తక్కువగా ఉన్నందున అదనంగా విద్యుత్తు ద్వీపాలను ఏర్పాటు చేసి విద్యుత్ వెలుగులు పెంచేలా చర్యలు చేపట్టాలని చేపట్టడంతో పాటు అన్ని దీపాలు పూర్తిస్థాయిలో వెలిగేలా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజనీర్లు సహాయ వైద్యాధికారులు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పుణెలో ఎల్బ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన ధనుశ్రీకి 63వ వార్డు జనసేన ఘన సన్మానం



**గోపాలపట్నం, సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

పుణెలో ఇటీవల నిర్వహించిన ఎల్బ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో 63వ వార్డు చింతలలోవ గ్రామానికి చెందిన ధనుశ్రీ స్వర్ణం సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ధనుశ్రీని 63వ వార్డు జనసేన అధ్యక్షులు శివ గొరిపూటి ఘనంగా సన్మానించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ గొరిపూటి మాట్లాడుతూ ధనుశ్రీ గ్రామానికి, తల్లిదండ్రులకు, గురువు రామారావుకి మంచి పేరు తీసుకువచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే వార్డులోని క్రీడాకారులకు ఎల్లప్పుడూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని, ధనుశ్రీ భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. కోచ్ రామారావు మాట్లాడుతూ క్రీడాకారులను నిరంతరం ప్రోత్సహిస్తూ తోడ్పాటునందిస్తున్న 63వ వార్డు జనసేన అధ్యక్షులు శివ గొరిపూటికి, చింతలలోవ గ్రామ అధ్యక్షులు శ్రీ నానాజీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం మరెందరో యువ క్రీడాకారులకు ప్రేరణగా నిలవాలని వారు ఆకాంక్షించారు.

## తుపాకులతో బెదిరించి కెనరా బ్యాంకులో దోపిడీకి యత్నం





**అనకాపల్లి,సిటిజన్ టైమ్స్, డిసెంబర్ 18:**

అనకాపల్లి రింగ్ రోడ్డు వద్ద ఉన్న కెనరా బ్యాంకులో గురువారం మధ్యాహ్నం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఐదుగురు దుండగులు తుపాకులతో బ్యాంకులోకి చొరబడి సిబ్బందిని బెదిరించి దోపిడీకి ప్రయత్నించారు ఆ సమయం లో బ్యాంకులో ఉన్న విని యోగదారు లను భయపెట్టి బయటకు రాకుండా అడ్డు కున్నట్లు సమాచారం అయితే బ్యాంకు సిబ్బంది అప్రమత్త మై వెంటనే అలారం మోగించ డంతో పరిస్థితి ఒక్కసారిగా మారింది. అలారం శబ్దం విని పించడంతో దుండగులు బైకు లపై అక్కడి నుంచి పరారై నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు ఘటన మొత్తం బ్యాంకులోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యింది సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు దుండగుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు ఈ ఘటనతో పరిసర ప్రాంతా ల్లో భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేశారు.

## శ్రీ శ్రీ శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారీ పూజా కార్యక్రమంలో పాల్గొన్న వెలగపూడి, కార్పొరేటర్ కెల్ల





**ఆరిలోవ, సిటిజన్ టైమ్స్, డిసెంబర్ 18:**

శ్రీ శ్రీ శ్రీ కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా ఆరిలోవకోలనిలో గల శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు చివరి గురువారం తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ, వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పంచామృత అభిషేకాలతో అమ్మవారికి పూజలు చేసి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చివరి గురువారం అధిక సంఖ్యలో భక్తులు వస్తారని ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి సీనియర్ నాయకులు పోత్రకొండధర్మారావు, యల్లమీల్లి సురేష్, మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, యువత అధ్యక్షులు వడిసెల శ్రీను ఆలయ కమిటీ సభ్యులు సాయిబాబు,శ్రీను,కేశవరావు,ఆనందరావు, ఈశ్వరమ్మ, పైడితల్లమ్మ, సత్యవతి, సంపత్ రావు, సత్యనారాయణ, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కిల్లం శెట్టి శ్రీనివాసరావు, కనకల శ్రీను, పైడిరాజు, గణపతి వెంకటేష్ దాలినాయుడు, యల్లమిల్లి రామకృష్ణ, కేబుల్ ప్రసాద్, మాధవ్ సాహు కర్రి మనీ కుర్రి లక్ష్మి, పాడి కళ్యాణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూ 18వ అఖిల భారత మహా సభలు జయప్రదం చెయ్యాలి - ఆర్ ఎస్ ఎన్ మూర్తి



**తగరపువలస సిటిజెన్ టైమ్స్ డిసెంబర్ 18:**

తగరపువలస సిఐటియు 18వ అఖిలభారత మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో తగరపువలస భీమిలి ఆనందపురం ప్రాంతాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు.బైక్ ర్యాలీని సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి జెండా ఊపి ప్రారంభించారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న తరుణంలో సిఐటియు అఖిలభారత మహాసభ విశాఖపట్నంలో కార్మిక వర్గానికి మంచి తరుణమని రాబోయే మూడేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాల్ని ఎలా ఎదుర్కోవాలో నిర్దేశించుకుని ఉద్యమ పోరాటాలను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని మూర్తిచెప్పారు.సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి ఎస్ అప్పలనాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ని వెంటనే రద్దు చేయాలని సమాన పనికి సమాన వేతనాలు అమలు చేయాలని అసంఘిటత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని కనీస వేతనాలు 26,000 చెల్లించాలని స్కీం వర్కర్లు ను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఔట్సోర్సింగ్ కాంటాక్ట్ కార్మికుల్ని పర్మినెంట్ చేయాలని మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకం యధావిధిగా కొనసాగించాలని ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని డిమాండ్ చేశారు. జనవరి 4తేదీ విశాఖపట్నంలో జరిగిన బహిరంగ సభను జయప్రదం చేయాలని కార్మికుల్ని కోరారు.సిఐటియు మండల అధ్యక్షులు నేలతి రాము పల్ల .పెంటరాజు అప్ప.కొండ పోలయ్య .సంకురి .బోతు రాము ప్రసాద్ రాంబాబుఆటో ముఠా కార్మికులు ఇతర కార్మికులు పాల్గొన్నారు.

## గంటా గ్రీవెన్స్‌కు రాజాం ఎమ్మెల్యే కొండ్రు మురళి



**మధురవాడ సిటిజన్ టైమ్స్, డిసెంబర్ 18**

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం మధురవాడ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమం ఆసక్తికరంగా సాగింది. రాజాం ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ స్వయంగా హాజరై గంటాకు వినతిపత్రం సమర్పించడం అందరి దృష్టిని ఆకర్షించింది. పీ.ఎం.పాలెంలోని తనకు సంబంధించిన బాబా ఇనిస్టిట్యూట్ (బిట్స్) సమీపంలో ఉన్న స్మశానం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని,దానికి ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని మురళి కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన గంటా.. తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మధురవాడ, ఎండాడ, ప్రాంతాల్లో బడ్డీల తొలగింపుతో ఉపాధి కోల్పోయిన పేదలకు న్యాయం చేయాలని పలువురు కోరారు. డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణం, తాగునీటి ఎద్దడి పరిష్కరించాలని స్థానికులు విన్నవించారు. ?ఈకార్యక్రమంలో జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, కార్పొరేటర్లు లొడగల అప్పారావు, పిల్లా మంగమ్మ, మొల్లి హేమలత తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## చిట్టీవలస జ్యూట్ మిల్లు పెన్షనర్ల సమావేశం

**తగరపువలస సిటిజెన్ టైమ్స్ డిసెంబర్ 18:**

చిట్టివలస జూట్ మిల్ పెన్షన్ల సంఘం అధ్యక్షులు కానూరు రాంబాబు ఆధ్వర్యంలో జరుపుకోవడం వలన రాష్ట్ర నాయకులు సుధాకర్ బాబు రావు హాజరైనారు. వారితో పాటు సంఘం ప్రధాన కార్యదర్శి దామోదర్ బాబాజీ ఉపాధ్యక్షులు చిల్ల అప్పారావు సహాయ కార్యదర్శి మోరా అప్పలరాజు కోశాధికారి పంపాను సూర్యనారాయణ సీనియర్ నాయకులు సింగిడి అప్పా రావు ఏ ఐ టి యు సి నాయకులు కొండపు ఈశ్వరరావు సిఐటియు నాయకులు నర్సింగరావు చిట్టివలస జూట్ మిల్ బాధితులు సంఘం నాగోతి అప్పలరాజు హాజరైనారు.మరి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వచ్చి సుధాకర్ ముందు గా పెన్షనర్ సభ్యులందరూ కాలం చేసి నా సభ్యులకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం తెలియజేశారు. తరువాత మన పెన్షన్ పోరాటయోధుడు డిఎస్ నకార ఫోటోకి పూలదండ వేసి జోహార్లు తెలియజేశారు. తర్వాత సుధాకర్ మాట్లాడుతూ మన పెన్షన్లు ఐక్యతే మనకి శ్రీరామరక్ష అని తెలియజేశారు.మరి ఇటీవల అనేక పోరాటాలు తీసుకొస్తున్న గ్రామాల నుండి జిల్లాలు రాష్ట్రాలు అలాగే ఢిల్లీలోని కూడా నిరసనలు తెలియజేశాము. ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మొండి వైఖరి అవలంబిస్తున్నాయి. ఈ తరుణంలో వ్యాల్యుటేషన్ బిల్లు పార్లమెంట్లో ప్రవేశ పెడుతుంది.ఈ బిల్లు చాలా మనకు నష్టదైకం గోరుచుట్టు పై రోకలి పోటు లాగా ఇప్పటికే పెన్షన్ ఇచ్చే పరిస్థితి కనిపించలేని గవర్నమెంట్ మరల ఈ పెన్షన్ నష్టదాయకంగా చేయడానికి ఈ గవర్నమెంట్ బిల్లును చేస్తుంది ఈ బిల్లును రద్దు చేయాలని తెలియజేశారు.మరీ ఇంత పెద్ద పోరాటాలు చేసినప్పటికీ కూడా ఈ కేంద్ర ప్రభుత్వానికి కనీసం మానవత దృక్పథం లేదని స్పష్టంగా కనిపిస్తుంది. కార్పొరేటు సంస్థలకు కొమ్ముకాస్తున్న ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం 9000 పేదవాడికి తిండి పెట్టండి




మహా ప్రభువా అని వినతులు ఇచ్చినప్పటికీ కూడా నిద్రపోతున్నట్టుగా నటిస్తున్నారు. కమిటీల మీద కమిటీలు సీబీటీ కమిటీలు వేసి కాలయాపన తప్ప పెన్షనర్లకు ఒరిగేది లేదని తెలియజేశారు. ఎంతటి పోరాలకి కైనా పెన్షనర్స్ సాధించే వరకు కూడా పోరాడుతామని తెలియజేశారు. వర్ధిల్లాలి పెన్షన్ల ఐక్యత వర్ధిల్లాలి పెన్షన్ ఐక్యత సాధిద్దాం మన హక్కు పెన్షన్లు ఎవరు దయదాక్షణ్యం కాదు పెన్షన్ అనేది కార్మికుని అక్కని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో దామోదర్ బాబాజీ మోర అప్పల రాజు చిల్ల అప్పారావు సింగిడి అప్పారావు మొదలగు మొదలకు సభ్యులు అనేకమంది పాల్గొని ఈ యొక్క కార్యక్రమాన్ని జయప్రదం చేసి ఉన్నారు. వారందరికీ కూడా ధన్యవాదాలు తెలుపుతూ మరొకసారి మీటింగ్లో ఇంకా మిగిలిన పూర్తి వివరాలు తెలియజేస్తామని జూట్ మిల్లు పెన్షన్ల సంఘం తెలియజేస్తున్నచిట్టువలస జూట్ మిల్లు కళ్యాణ మండపంలో జూట్ మిల్లు పెన్షన్ల సంఘం అండ్ ఆల్ రిటైర్మెంట్ పెన్షనర్ సంఘం ఫన్షనర్స్ డే జరుపుకోవడం జరిగినది. ఈ సమావేశానికి అనేకమంది సభ్యులు పాల్గొన్నారు ఈపీఎఫ్ 95 పెన్షన్. డే ఈరోజు జరుపుకున్నాం.

## బక్కన్నపాలెంలో వ్యక్తి అదృశ్యం

**మధురవాడ,సిటిజన్ టైమ్స్, డిసెంబర్ 18**



స్థానిక బక్కన్నపాలెం ప్రాంతానికి చెందిన అల్లాడ నాగరాజు (36) ఈ నెల 9వ తేదీ నుంచి కనిపించకుండా పోయినట్లు పీఎంపాలెం పోలీసులు తెలిపారు. పీ.ఎం.పాలెం పోలీసులు అందించిన సమాచారం మేరకు... బక్కన్నపాలెం రామాలయం సమీపంలో నివసించే నాగరాజు,గత మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో, అతని భార్య రమ్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.నాగరాజు ఆచూకీ తెలిసిన వారు పీఎంపాలెం పోలీసులకు సమాచారం అందించాలని సీఐ జి.బాలకృష్ణ కోరారు.

## బాజపా రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ తో కేఎన్ఆర్ బేటీ

### డిశంబరు 20న బీచ్ రోడ్డులో వాజపేయి విగ్రహ ఆవిష్కరణ బహిరంగ సభ




**గాజువాక, సిటిజన్ టైమ్స్, డిసెంబర్ 18:**

బాజపా రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ తో గాజువాకకు చెందిన రాష్ట్ర మీడియా పేనలిస్ట్ డా.కరణంరెడ్డి. నరసింగరావు బేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటల్ మోదీ సుపరిపాలన యాత్ర డిసెంబర్ 20కి విశాఖ చేరుకుంటుందని చెప్పారు. ఆ రోజు బీచ్ రోడ్డు ద పార్క్ హోటల్ కూడలిలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ , గౌరవ అతిథిగా రాష్ట్ర ఆరోగ్యశాఖ శాఖ మంత్రి సత్యకుమార్ కూటమి నాయకులు పాల్గొంటారని తెలిపారు. అదే రోజు సాయంత్రం అనకాపల్లి జిల్లాలో వాజపేయి విగ్రహావిష్కరణ, బహిరంగ ఉంటుందని తెలిపారు. అనకాపల్లిలో సియం చంద్రబాబు నాయుడు ముఖ్య అతిధిగా పాల్గొంటారని తెలిపారు. కేఎన్ఆర్ మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గం నుండి రెండు వేల మంది కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. విశాఖ సభ అనంతరం బస్సు యాత్ర గాజువాక మీదుగా కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఒమ్మి రంగనాయకులు, అశోక్ చేబ్రోలు,జిల్లా కార్యవర్గం సభ్యులు నాగేశ్వరరావు, మైనారిటీ మోర్చా గాజువాక ఇంచార్జ్ కొల్లి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 20 న జరగవలసిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశములు డిసెంబర్ 26కు వాయిదా

### జిల్లా పరిషత్, సీఈవో, పి.నారాయణమూర్తి

**విశాఖపట్టణం, సిటిజన్ టైమ్స్, డిసెంబర్ 18:**

జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ అధ్యక్షతన ఈనెల 20న జరగవలసిన జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు డిసెంబర్ 26 తేదీ నకు వాయిదా పడినట్లు జిల్లా పరిషత్ సీఈవో, పి.నారాయణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 26 తేదీ ఉదయం 11.00 నుంచి జడ్పీ ఛైర్ పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఆమె ఛాంబర్ సమీపంలోని వి.సి.హాలులో మరియు జడ్పీ సమావేశ మందిరంలో 1 నుంచి 7 వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 11.00 నుంచి 2.00గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. 2, 3 మరియు6 స్థాయి సంఘ సమావేశాలు11:00 గంటలకు, 4,5వ స్థాయి సంఘ సమావేశాలు12:00 గంటలకు,1,7వ సాయి సంఘ సమావేశాలు 2:00 జరుగుతాయని వివరించారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపీపీలు, మరియు అధికారులు సంబంధించిన ప్రగతి నివేదికలతో సమావేశాలకు హాజరుకావాలని ప్రకటన ద్వారా తెలిపారు.

# రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు

## రూ.2.5 కోట్లతో సాగర్ నగర్ లో నైట్ ఫుడ్ కోర్టు





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, డిసెంబర్ 18:**

జీవీఎంసీ 8 వ వార్డు పరిధిలోని ఎండాడ, రుషికొండ, సాగర్ నగర్, వైఎల్పీ లే అవుట్, పాత మధురవాడ తదితర ప్రాంతాల్లో 7.74 కోట్లతో ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. వీటిలో రూ.4.28 కోట్లతో 9 రోడ్లు, రూ. కోటితో 4 డ్రెయిన్లు, రూ.38 లక్షలతో 2 పార్కులు, రూ.1.60 కోట్లతో 2 శ్మశాన వాటికలు ఏర్పాటు సహా రూ. 46 లక్షలతో చెరువు అభివృద్ధి పనులు ఉన్నాయి. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంలోని 9 జీవీఎంసీ వార్డుల్లో రూ.150 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఒక్క నవంబరు నెలలోనే రూ.25 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. రూ. 500 కోట్లతో మధురవాడకు మంచినీటి ప్రాజెక్టు.. రూ. 465 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ప్రాజెక్టు పనులు తొందర్లోనే ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. సాగర్ నగర్ బీచ్ బ్యూటిఫికేషన్ కోసం రూ.16 కోట్ల ప్రాజెక్టు డిజైన్ చేశామని, అలాగే 2.5 కోట్లతో సాగర్ నగర్ లోనే నైట్ ఫుడ్ కోర్టు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక అభివృద్ధి పనులు వెల్లువలా జరుగుతున్నాయన్నారు. మధురవాడ ఐటీకి కేరాఫ్ అడ్రస్ గా మారనుందని, కాగ్నిజెంట్, సత్వా, ఫ్లూయాంట్ గ్రిడ్, ఇమేజినేటివ్ వంటి 9 ఐటీ.. ఐటీ ఆధారిత కంపెనీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి లోకేష్ ఇటీవల శంకుస్థాపన చేశారన్నారు. తొందర్లోనే ఇన్ఫోసిస్, యాక్సెంచర్ పూర్తిస్థాయి భవనాలకు శంకుస్థాపన చేయనున్నారని, ఐటీ సంస్థలన్నీ అందుబాటులోకి వస్తే దాదాపు లక్షన్నర నుంచి రెండు లక్షల మందికి యువతకు ఉపాధి కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు పంచకర్ల సందీప్, కార్పొరేటర్ లొడగల అప్పారావు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, చెట్టిపల్లి సన్యాసిరావు, శాఖారి శ్రీనివాస్, మంగాదేవి, చెట్టిపల్లి గోపీ, దొరబాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# హిందూ సమ్మేళన కరపత్రాలు ప్రారంభం



**రామచంద్రాపురం సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

ఈ నెల 24 తేదిన బుధవారం భీమేశ్వరా స్వామి దేవస్థాన కళ్యాణ మండపం వద్ద జరిగే హిందూ సమ్మేళనం కార్యక్రమం కరపత్రాలు ప్రారంభోత్సవం జరిగింది.ఈ కరపత్రాలను రుచి అభిరుచి ఫుడ్స్ అధినేత చోడశెట్టి వీర భద్ర రావు ఏర్పాటు చేశారు. దాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయంలో ముందుగా కరపత్రాలను స్వామివారి దగ్గర అమ్మవారి దగ్గర ఉంచి ఆలయ అర్చకులు నిర్వహణ సమితి సభ్యులు విస్సు పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆకేటీ శ్రీకృష్ణ, కర్ర తాతీలు దుళ్ల కొండ, నరాల రాజ్య లక్ష్మి , పెంకే సాంబా శివరావు, ఆర్ ఎస్ ఎస్ నుండీ బి వి సి నారాయణ,మండల ప్రముఖ్ ఆళ్ల బుజ్జి,రాజేష్,అర్చక పురోహిత బ్రాహ్మలు పాల్గొన్నారు.

# క్రైస్ట్ ఇవాంజిలికల్ లూథరన్ మినిస్ట్రీ ద్వారా ముంథా సైక్లోన్ బాధితులకు రిలీఫ్ ఫండ్

*బియ్యం, నూని, పప్పులు పంపిణీ,*

*క్రైస్ట్ ఇవాంజిలికల్ లూథరన్ మినిస్ట్రీ*

*105 కుటుంబాలను గుర్తించి సరుకులు*


*అందించిన పాస్టర్ ఐతి షాలేం రాజు*




**ప్రత్తిపాడు, సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గా ల లో కొన్ని గ్రామాల నుండి ముంథా తుఫాన్ బాధితులను గుర్తించి వారికి నిత్యవసర సరుకులు బియ్యం, నూని, పప్పులు క్రైస్ట్ ఇవాంజిలికల్ లూథరన్ మినిస్ట్రీ డైరెక్టర్స్ కే విజయ్ కుమార్, అశోక్ కుమార్ లు పంపిణీ చేయగా వాటిని కాకినాడ జిల్లా కోఆర్డినేటర్ పాస్టర్ ఐతి షాలెం బాధిత కుటుంబాలకు అందించడం జరిగింది. క్రైస్ట్ ఇవాంజిలికల్ లూథరన్ మినిస్ట్రీ ద్వారా ఎంతో మందిని ఆధ్యాత్మికంగా బలపరిచి ఎన్నో కుటుంబాలను చెడు అలవాట్ల నుండి తప్పించి సమాజంలో గౌరవంగా బ్రతకడానికి ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. క్రైస్ట్ ఇవాంజిలికల్ లూథరన్ మినిస్ట్రీ వారు ఎన్నో సేవా కార్యక్రమాల ద్వారా వెనకబడిన వారికి విద్యను అందిస్తూ మరి ఎంతో మందికి ఆవాసాలను ఏర్పాటుచేసి ఆసరాగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగానే ముంథా తుఫాన్ వల్ల బాధితులైన 105 కుటుంబాల వారికి నిత్యవసర సరుకులు అందించడం జరిగింది. క్రైస్ట్ ఇవాంజిలికల్ లూథరన్ మినిస్ట్రీ వారు చేస్తున్న స్వచ్ఛంద సేవను పలువురు దైవజనులు, పెద్దలు, గ్రామస్తులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ఐతి షాలేం రాజు తో పాటు బేతేలు పెంతుకోస్తు చర్చ్ పాస్టర్ రాజాల షాలెం రాజు, పాస్టర్ అగస్టిన్, తదితర సంఘాల దైవజనులు పాల్గొన్నారు.

# టేబుల్ టెన్నిస్‌లో కిమ్స్ విద్యార్థిని ప్రతిభ





**అమలాపురం సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డాక్టర్స్ టేబుల్ టెన్నిస్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ చూపి మూడు పతకాలను కిమ్స్ విద్యార్థిని డా.నిత్యాల పెద్దిరెడ్డి గెలుచుకున్నారు. విశాఖ పట్టణం లో ఈ నెల 14 వ తేదీ శనివారం జరిగిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డాక్టర్స్ టేబుల్ టెన్నిస్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ చూపి, కిమ్స్ మెడికల్ కాలేజీ విద్యార్థిని డా.నిత్యాల పెద్దిరెడ్డి మూడు విభాగాలలో బహుమతులు గెలుచుకుందని, ఆమె మహిళల సింగిల్స్ లో తృతీయ , మహిళల డబుల్స్ లో ద్వితీయ, మిక్స్డ్ డబుల్స్ లో తృతీయ బహుమతులను గెలుచుకున్నారనని, కిమ్స్ డీన్ డా.ఆనంద్ ఆచార్య తెలిపారు. కిమ్స్ మెడికల్ కాలేజీ లో విద్యార్థులకు విద్య తో పాటు ఆటలలో ప్రత్యేక ప్రోత్సాహం కల్పిస్తున్నామని,శారీరక ఆరోగ్యం మానసిక ఆరోగ్యానికి కూడా తోడ్పడుతుందని ఆయన తెలిపారు. టేబుల్ టెన్నిస్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ చూపిన డా. నిత్యాల రెడ్డిని, ప్రోత్సహించిన కిమ్స్ వ్యాయామ ఉపాధ్యాయులను కిమ్స్ చైర్మన్ కె.వి.వి. సత్యనారాయణ రాజు మరియు కిమ్స్ ఎం.డి.రవి కిరణ్ వర్మ అభినందించారు.

# అమరావతి కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కాకినాడ కలెక్టర్

**కాకినాడ సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

రాష్ట్ర ప్రభుత్వం గురువారం అమరావతి రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన రెండో రోజు కలెక్టర్ల కాన్ఫరెన్స్ కు హాజరైన జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జి. బిందు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.



# టిడిపి తీర్థం పుచ్చుకున్న వైసీపీ నాయకులు

## *చిన్నలబుడు పంచాయితీలో టిడిపి జోష్*



**అరకు, సిటిజన్ టైమ్స్, డిసెంబర్ 18:**

అరకువ్యాలీ మండలం కేంద్రంలో గల చిన్నలబుడు పంచాయితీలో గొందివలస , దొర వలస, గ్రామ వైసిపి నాయకులు కార్యకర్తలు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు, వైసిపి నాయకులు మాజీ ఉపసర్పంచ్ గేమాల చిరంజీవి, బురిడీ సుందరమ్మ, ముసిరి మల్లన్న, సాగరా రామారావు, సుమారు 150 కుటుంబాలు,గురువారం టిడిపి సీనియర్ నాయకుడు సర్పంచ్ అభ్యర్థి కిల్లో శ్యామ్, ఆధర్యంలో టిడిపి పార్టీలో చేరికలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నా ,టిడిపి అరకు ఇన్చార్జి సియ్యారి దొన్నుదొర చేతుల మీదగా వైసిపి నాయకులను కార్యకర్తలను టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారితోపాటు అరకు వ్యాలీ టిడిపి మండల అధ్యక్షుడు లోక్కయి మహాదేవ్, సర్పంచ్ పెట్టెలి దాసు బాబు, పాల్గొన్నారు, ఈ సందర్భంగా అరకు టిడిపి ఇన్చార్జి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలు ప్రశంసిస్తారని ఈ అభివృద్ధి పనులను చూసి వైసిపి నాయకులు కార్యకర్తలు ఆకర్షితులై అభివృద్ధిలో భాగస్వామి కావాలని వారు కోరుకుంటూ టిడిపి పార్టీలో తీర్థం పుచ్చుకుంటున్నారని అన్నారు, ప్రజల అభివృద్ధిని కోరుకునే పార్టీ ఏకైక పార్టీ టిడిపి పార్టీ ప్రజలు నమ్ముతున్నారు, ఈ రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరగాలంటే కేవలము మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తోనే సాధ్యమని వారన్నారు, ఈ కార్యక్రమంలో చిన్నానలబుడు టిడిపి నాయకులు మాజీ ఎంపీటీసీ గొల్లూరి సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ కిల్లో దయ, టిడిపి సీనియర్ నాయకుడు బురిడీ గోకుల్ దాస్, బుద్ది పరమానందం వార్డ్ నెంబర్, తామల్ల కన్నయ్య వార్డ్ నెంబర్, గొల్లూరి రాజు. మజ్జి నారాయణ, పంచాయతీ కమిటీ అధ్యక్షుడు భగత్ రాం, గ్రామ కమిటీ అర్జున్, కమిటీ నెంబర్ మధుసూదన్, కిల్లో బసవరావు, లోకో సీతారాం, సింహాద్రి, కొల్లూరి జగబంధు, కిల్లో బాబురావు, పొద్దు మోహన్, ముసిరి అప్పన్న, తామల భీమరాజు, గుమ్మడి రామన్న, కుర్ర సుబ్బారావు, సోమన్న తామల సోమన్న, శోబోయి పోలన్న, తామల జగబంధు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇ-ఆఫీసు విధివిధానాలపై శిక్షణ



**అమలాపురం సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజలకు సేవలు అందించే ముఖ్యమైన విభాగాలలో సమర్థవంతమైన, పారద ర్శకమైన బాధ్యతాయుత మైన పాలన కోసం ఇ ఆఫీ స్ నిర్వహణ కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా జాయిం ట్ కలెక్టర్ టి నిశాంతి తెలి పారు గురువారం స్థానిక కలెక్టరేట్ నందు సిబ్బందికి ఇ ఆఫీస్ నిర్వహణ అంశాల పట్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించి కార్యాలయంలో అమలు చేయాల్సిన ఇ ఆఫీస్ నిర్వహణ అంశాలు వాటికి సంబంధించిన విధి విధానాలపై శిక్షణను ఇచ్చారు. రెవెన్యూ సిబ్బందికి ఈ ఆఫీస్ ద్వారా ఫైల్స్ ఎలా నిర్వహించాలి తదితర అంశాలపై జె సి ట్రైనింగ్ క్లాస్ నిర్వహించగా ఎన్ ఐ సి టెక్నికల్ అసోసియేట్ గౌతమ్ సిబ్బంది సందేహాలు నివృత్తి చేశారు. ఈ ఆఫీసులో పాటించాల్సి నటువంటి ఖచ్చితమైన ప్రొసీజర్ ని తెలియజేయడం జరిగింది.జాయింట్ కలెక్టర్ ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కచ్చితంగా ఫైల్స్ ను ఇ-ఆఫీస్ ద్వారా ప్రాసె స్ చేయమని, కలెక్టరేట్లో గాని కార్యాలయాల్లో ఇ ఆఫీస్ వాడవలసి నటువంటి ఆవశ్యకత గురించి విశదీకరించారు.కార్యాలయ పనులు సక్రమంగా, సమయాను కూలంగా నిర్వహిస్తూ,ప్రజలకు మెరుగైన సేవలు అందించడం వల్ల ఉద్యోగుల పనితీరు మెరుగవుతుందన్నారు ప్రజలకు సుపరి పాలన చేరువ కావడంతో పాటుగా ని బ్బంది లో పారదర్శకత, బాధ్యత, క్రమశిక్షణను పెంపొంది స్తుందన్నారు. ఫైల్ నిర్వహణ ద్వారా ఫైళ్లను నమోదు చేయడం, వర్గీకరించడం, సంఖ్య కేటాయిం చడం, ఫైల్ మూవ్‌మెంట్ రిజిస్టర్ నిర్వహించడం,పాత ఫైళ్లను రికార్డ్ రూమ్‌లో భద్రపరచ డం, గోప్యమైన ఫైళ్లకు ప్రత్యేక భద్రత కల్పించడం చేయాలన్నారు. ఇన్‌వర్డ్, అవుట్‌వర్డ్ రిజిస్టర్లు నిర్వ హణ వచ్చిన లేఖలను సంబంధిత విభాగాలకు తక్షణమే పంపించా లన్నారు. సమాధానాలు నిర్ణీత గడువులో సమర్పించాల న్నారు.సేవా రికార్డులు, ఖాతా రికార్డులు,స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. రికార్డుల సంరక్షణలో కాలపరిమితి పాటించాలన్నారు.అవసరం లేని రికార్డులను నిబంధనల ప్రకారం తొలగించాలన్నారు. ఉద్యోగుల హాజరు రిజిస్టర్ నిర్వహించడం,విధుల కేటాయింపు స్పష్టంగా చేయడం,సెలవులు, సేవా నిబంధనలు పాటించడం శిక్షణ,పనితీరు సమీక్షలు బడ్జెట్ ప్రకారం ఖర్చులు చేయడం క్యాష్ బుక్, బిల్లులు, వోచర్లు నిర్వహించడం ఆడిట్ నిబంధనలతో ఆర్థిక పారదర్శకతను చేప ట్టాలన్నారు.కార్యాలయ క్రమ శిక్షణ ప్రవర్తనకార్యాలయ సమయాలు కచ్చితంగా పాటించడం,ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఉద్యోగ నియమావళినీ పాటించాలన్నారు. సమాచార సాంకేతికత వినియోగంతో కంప్యూటర్లు,ఆన్ లైన్ సాఫ్ట్‌వేర్ ద్వారాఈ-ఆఫీస్, డిజిటల్ ఫైల్ సిస్టమ్ అమలు చేస్తూడేటా భద్రత గోప్యత పాటించాలన్నారు.కార్యాలయంలో ఆఫీస్ నిర్వహణ విధి విధానాలు సక్రమంగా అమలైతే పని తీరు మెరుగుపడి ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించవచ్చున న్నారు అందువల్ల ప్రతి ఉద్యోగి తన విధులను బాధ్యతతో నిర్వ హించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సెక్షన్ సూపరింటెండెంట్లు సిబ్బంది పాల్గొన్నారు.

# అంగర లో వైజ్ఞానిక ప్రదర్శన కపిలేశ్వరపురం



**సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

కపిలేశ్వరపురం మండలం అంగర జడ్పీ ఉన్నత పాఠశాల లో గురువారం మండల స్థాయి లో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని మండల విద్యా శాఖాఅధికారి కే. తాతారావు ప్రారంభించారు. మండల స్థాయి లో పలు పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన పలు పలు ప్రయోగాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఈ ప్రయోగాల్లో 7 అంశా లులో మొదటి బహుమతి పొందినవారు. వాటిలో ముఖ్యం గా ఎమర్జింగ్ టెక్నాలజీ ప్రయోగాన్ని, గ్రీన్ ఎనర్జీ, హెల్త్ అండ్ ఐజిన్ ను, రీ క్రియేషనల్ మ్యాథమెటికల్ మోడలింగ్ ప్రయోగం, సస్టేనేబుల్ అగ్రికల్చర్, వేస్ట్ మేనేజ్మెంట్ ఆల్టర్నేటివ్ టు ప్లాస్టిక్స్, వాటర్ కన్వర్జేషన్ తదితర ప్రయోగాలను మండల స్థాయి లో పలు పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు రూపొందించిన వాటిని ఎంపిక చేసి, వారికి సర్టిఫికెట్స్ అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. మండల విద్యాశాఖాధికారి కె.తాతారావు, సెకండ్ ఎం.ఈ. ఓ.కె.విజయ్ కుమార్ మండల స్థాయి పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# సేవే మార్గం గా మన వాడ వాడకు -మన ఎమ్మెల్యే గిడ్డి

## -పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి..

**అయినవిల్లి సిటిజెన్ టైమ్స్ డిసెంబర్ 18**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజవర్గం అయినవిల్లి మండలంలో మదుపల్లి, వెలువలపల్లి, చింతల లంక మూడు గ్రామాల ప్రజా సమస్యలు నేరుగా పరిష్కరించడానికి జరిగిన మన వాడవాడకు -మనఎమ్మెల్యే గిడ్డి కార్యక్రమంలో పాల్గొన్న పి.గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ. ముందుగా మూడు గ్రామాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు అంబారి అశ్వ వాహనము ఎక్కించి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ని పూలతో జల్లుతూ, జయజయద్వానాలతో పలుకుతూ,ఎన్డీఏ ప్రభుత్వం అధినాయకులకు నినాదాలు చేస్తూ, భారీ స్థాయిలో ఘనంగా స్వాగతం పలికి ,గ్రామ ముఖద్వారం వద్ద భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కి పూలమాలలు వేసి, మన వాడ వాడ మన ఎమ్మెల్యే గిడ్డి కార్యక్రమంలో ప్రజల నుండి విజ్ఞప్తులను అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు ,నాయకులు సమక్షంలో స్వీకరించి, అధికారుల సమక్షంలోనే పరిష్కారం తెలియచెప్పి మూడు గ్రామాల ప్రజల మధ్య ఎంతో ఆనంద వాతావరణంలో మన వాడవాడకు మన ఎమ్మెల్యే గిడ్డి కార్యక్రమం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ నిర్వహించినారు. ప్రజలు తెలియజేయుచున్న సమస్యలను వినుటకు, పరిష్కరించుటకు ఒక ప్రక్క ప్రజాప్రతితులను మరొక ప్రక్క అధికారులను దగ్గర పెట్టుకుని ప్రజల వద్ద నుండి స్వచ్ఛందంగా విజ్ఞప్తులను శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ స్వీకరించినారు. వెలవలపల్లి గ్రామమునకు చెందిన నిరుపేద తాళ్లూరి మరియమ్మ కుమారుడు గుండెపోటు ఆపరేషన్ చేయించుకుంటే దురదృష్టం వలన రెండు నేత్రములను పోగొట్టుకుని పేదరికంతో ఉన్న ఆ కుటుంబమునకు శాసనసభ్యులు యోగక్షేమాలను విని వెంటనే స్థానిక తాసిల్దార్ విద్యాపతి, వీఆర్వోలను పిలచి ప్రజల సమక్షంలో వారికి వేదిక వద్ద రెండు సెంట్లు ఖాళీ నివేశ స్థలమును పంపిణీ చేసి ,వారిని మీరు ఒంటరి వారు కాదని, భరోసా ఇచ్చిన ఈ సంఘటనతో ఆ కుటుంబంలో ఆనందోత్సవం నింపిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ను మూడు గ్రామాల ప్రజలు,నాయకులు, అధికారులు,ప్రజాప్రతినిధులు ,శాసనసభ్యుల ఔదర్యాన్ని



కొనియాడినారు.

మన వాడవాడకు మన ఎమ్మెల్యే గిడ్డి కార్యక్రమంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఎవరూ చేయని, ఎవరు సాహసించని ప్రజల యొక్క అపరిస్కృత సమస్యలను మరియు ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ కార్యక్రమాలు అందని నిరుపేదలను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏ విధంగా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారో సేవే మార్గముగా ప్రజా హృదయాలను దోసుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సేవా మార్గమును స్ఫూర్తిగా తీసుకొని ,ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉన్నత ఆశయాలను ప్రజలలో తీసుకువెళ్లడానికి మన వాడవాడకు మన ఎమ్మెల్యే గిడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని, ఈ కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన ప్రతి విజ్ఞప్తిని పరిశీలించి వారికి న్యాయం చేయడం జరుగుతుందని అన్నారు, ప్రతి గ్రామంలోనూ గ్రామాలకు కావలసినటువంటి పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, అన్ని సమయములోనూ అన్నివేళలా మీ వ్యక్తిగా అందుబాటులో ఉండడం జరుగుతుందని, ప్రజలకు సేవ చేయడానికి ఈ కార్యక్రమాన్ని ప్రజల సమక్షంలో నిర్వహించడం కి సహకరిస్తున్న ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, ప్రజలకు, పత్రిక విలేకరులకు, కార్యకర్తలకు అందరికీ కూడా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అభినందనలు తెలిపారు.



ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జీవి సరోవర్, తాసిల్దార్ విద్యాపతి, సచివాలయ అధికారి రాజ్ మోహన్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ రాయుడు, వివిధ శాఖల మండల ప్రభుత్వ అధికారులు, పి. గన్నవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ భీమరాజు, సిబ్బంది, అంబాజీపేట మార్కెటింగ్ చైర్మన్ చిట్టూరి శ్రీనివాసరావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యపరాజు, సత్తిబాబు రాజు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి మద్దాల సుబ్రహ్మణ్యేశ్వర రావు, బిజెపి మండల పార్టీ అధ్యక్షులు వెంకటరమణ, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు శ్యామ్,కుప్పాల రాంబాబు, గ్రామ సర్పంచులు నిమ్మకాయల వెంకటలక్ష్మి, బొంతుమణి, చింతలపూడి వెంకటరత్నం, డిస్ట్రిబ్యూటర్ అధ్యక్షులు కాకర శ్రీనివాస్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు పోలిశెట్టి రాజేష్, జనసేన పార్టీ సమన్వయకర్త మద్ద చంటిబాబు, అయినవిల్లి సొసైటీ అధ్యక్షులు విల్ల గోపి, మాజీ సర్పంచ్ విల్ల రాము, మాజీ ఎంపీపీలు సలాది పుల్లయ్య నాయుడు, గుమ్మడి వెంకటేశ్వరరావు, పులపర్తి సుజాత, శ్రీను, మేడిశెట్టి అంజిబాబు,చోడే లోవరాజు, విల్ల నవీన్, నిమ్మకాయల సత్యనారాయణ, నిమ్మకాయల సురేష్, నిమ్మకాయల బాలాజీ, దేశం శెట్టి బుజ్జి, మద్దింశెట్టి గణేష్, పోతుల లక్ష్మణుడు, సవరం నాయుడు, కుడిపూడి బుజ్జి, బొంతు శ్రీను, మేడిద దుర్గ ప్రసాద్, , కొప్పినాతి శ్రీరామచంద్రమూర్తి, కోరపు ఈశ్వర్ ఎన్డీఏ పార్టీ రాష్ట్ర జిల్లా మండల గ్రామస్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు అధికారులు ,కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ఎన్డీఏ పార్టీ వివిధ అనుబంధ సంస్థల అధ్యక్షులు, మూడు గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం



**విస్సన్నపేట (సిటిజన్ టైమ్స్) డిసెంబర్ 18**

ఎన్టీఆర్ జిల్లా, తిరువూరు నియోజకవర్గం, విస్సన్నపేట మండలం శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. టాటా ఏసి వాహనాన్ని, పాఠశాల బస్సుని అతివేగంగా ఓ లారీ ఓవర్ చెక్ చేయబోయి బైకు ని ఢీ కొట్టింది. ఆ బైక్ పై మారుతి కంపెనీలో పనిచేస్తున్న గురుదేవ్ (ఇరవై నాలుగు) అనే వ్యక్తి అక్కడికక్కడ మృతి చెందాడు. టాటా ఏసీ మరియు బస్సు గుద్దుకున్నాయి. ఆ బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థు లకు ఎలాంటి గాయాలు కాలేదు. ఆ బైకు ని ఢీకొని లారీ వెళ్ళిపోతుం డడంతో పోలీసులు లారీని పట్టుకొని స్టేషన్లకు తరలించారు.

# విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల పంపిణీ



**రెడ్డిగూడెం (సిటిజన్ టైమ్స్) డిసెంబర్ 18**

రెడ్డిగూడెం మండలం ముద్దుల పర్వ గ్రామంలోని ఏపీ మోడల్ పాఠశాల నందు పదవ తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ పుస్తకాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ ముప్పిడి. నాగేశ్వరరావు రెడ్డి, బొమ్మిన.కోటేశ్వరరావు, సోమేశ్వరరావు, యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ప్రకాష్ పాల్గొనడం జరిగింది. పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేసినందుకు విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులు, వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఇసుక టెండర్లు ఫైనల్ చేసిన జిల్లాస్థాయి కమిటీ





**అమలాపురం సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 4 సెమీ మెకానిజడ్ ఇసుక రీచులలో ఇసుక త్రవ్వకాలు, లోడింగు నిల్వ కేంద్రాలు ఏర్పాటుకు జిల్లా స్థాయి కమిటీ టెండర్లు షీల్డ్ పిలు వగా 20 మంది సీల్డ్ టెండర్లు దాఖలు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి వెల్లడించారు. గురువారం సీల్ టెండర్లు తెరిచి ఫైనలైజేషన్ చేయగా ఆలమూరు మండలం జొన్నాడ సెమీ మెకానిజం రీచ్ కు ఆర్ ఎస్ ఆర్ ఇన్ఫ్రా కంపెనీ వారు సీల్ టెండర్ ను దక్కించుకున్నారని, ఆత్రేయపురం మండలం మెర్లపాలెం సెమీ మెకానైజ్డ్ రీచ్ ను సుంకర ఇన్ఫ్రా కంపెనీ దక్కించుకోగా, ఆలమూరు మండలం ఆలమూరు సెమీ మెకానైజ్డ్ రీచ్ ను కూడా సుంకర ఇన్ఫ్రా కంపెనీ వారు దక్కించుకోగా, కపిలేశ్వరపురం సెమీ మెకానేజ్ రీచ్ ను జి ఎస్ ఆర్ ఇన్ఫ్రా కంపెనీవారు సీల్డ్ టెండర్ల ద్వారా దక్కించుకున్నట్లు ఆమె వెల్లడించారు.ఈ సెమీ మెకానిజడ్ రీచ్డ్ ఒక సంవత్సరం కాలం పాటు ఇసుక తవ్వకాలకుగాను గడువులను విధించడం జరిగిందన్నారు .ఈ కార్యక్రమంలో జిల్లా భూగర్భ కనుల శాఖ సహాయ సంచా లకులు ఎల్ .వంశీధర్ రెడ్డి డ్వామా ఏపీడి డి.రాంబాబు, జిల్లా రవాణా అధికారి డి. శ్రీనివాసరావు, గోదావరి హెడ్ వర్క్స్ కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీనివాస్, జిల్లా సబ్ రిజిస్టర్ ఏ.వి.వి. సత్యనారాయణ,ఆడిట్ అధికారి మురళీకృష్ణ, రియాల్టీ ఇన్స్పెక్టర్ పి సుజాత టెక్నికల్ అసిస్టెంట్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

# మండపేట లో నిర్వహించే...

# హిందూసమ్మేళనం విజయవంతం చేయాలి....




**కపిలేశ్వరపురం సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

మండపేట సూర్య కన్వర్షన్ హాల్ లో ఈ నెల 23 న నిర్వహించే హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యక్రమ అధ్యక్షులు చంద్రు అగస్తరాజు కోరారు. ఈ నెల 23 మంగళవారం ఉదయం 9 గంటలకు సూర్యకన్వన్షన్ హాల్ లో జరిగే ఈ సమ్మేళనానికి ముఖ్య అతిధిగా ఏలూరు స్వామి పూర్వజానంద సరస్వతి (చిన్నయ్యమిషన్ ), ఆర్ ఎస్ ఎస్ గోదావరి విబాగ్ కార్యకారిణి సభ్యులు వాద్రేవు మాణిక్యాలరావు లు పాల్గొంటారని చెప్పారు. భారతదేశం సనాతన ధర్మానికి ప్రకృతి నిలయమన్నారు. పురాణాల్లో అవన్నీ లిఖించబడ్డాయన్నారు. ఆనాడు దేశాన్ని శత్రువుల నుండి హిందూ సమాజాన్ని కాపాడడానికి చత్రపతి శివాజీ మహారాజ్ ఏ విధంగా అయితే పోరాడి హిందూ సమాజం స్థాపితం చేశాడో నేడు హిందూ సమాజాన్ని కాపాడుకునే మహత్తర కార్యక్రమం ఆసన్నమైందన్నారు. దీనికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం ప్రజలకు అందుబాటులో సేవా కార్యక్రమాలు చేస్తుందన్నారు. విజయదశమికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సమాజం కోసం చేసే సేవా కార్యక్రమంలో భాగంగా మారిందన్నారు. హిందూ సమ్మేళన కార్యక్రమం దేశవ్యాప్తంగా జరుగుతుందనీ చెప్పారు. హిందూబంధువులందరూ తరలిరావాలని కోరారు. కార్యక్రమ కరపత్రాలు విడుదల చేశారు. ఈకార్యక్రమంలో కోన సత్యనారాయణ, సింగిడి శివశంకర్,కోన ఉషాకుమారి, ఆర్ శ్రీనివాస్ చౌదరి,గన్నేడ సూర్య పాపారావు,గంతకాయలవిష్ణు,కుడుపూడి హరిబాబు, కాటాచినజనార్దన్,కాటాబీమేశ్వరరావు,లేగా అంజిబాబు, సింగిడిసత్తిబాబు పాల్గొన్నారు.

# ముంగండ లో సైన్స్ ఫెయిర్

## - ప్రారంభించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

**పి గన్నవరం సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి.గన్నవరం మండలం ముంగండ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను పి. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించడంలో ఇలాంటి సైన్స్ ఫెయిర్‌లు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈరోజు సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని, ముఖ్యంగా విద్యార్థులు వ్యర్థ పదార్థాలను ఉపయోగించి తయారు చేసిన నమూనాలు ఎంతో ఆలోచనాత్మకంగా, నిత్యజీవితంలో ఉపయోగపడే విధంగా ఉండటం అభినందనీయమని అన్నారు. వేస్ట్ మెటీరియల్‌ను ఉపయోగించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే విధంగా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు చూసి ఎంతో సంతోషంగా ఉందని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆవిష్కరణ శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో దేశ అభివృద్ధికి శాస్త్ర సాంకేతిక రంగం ఎంతో కీలకమని, విద్యార్థులు చిన్న వయసు నుంచే విజ్ఞానంపై ఆసక్తి పెంచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సైన్స్ ఫెయిర్‌కు హాజరైన వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించిన విధానాన్ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు, నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని సైన్స్ ఫెయిర్‌ను తిలకించారు.

# గ్రామపంచాయతీ టైమ్ స్కేల్ ఉద్యోగుల జీతాల సమస్య పరిష్కారం



**ఆలమూరు సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న మినిమమ్ టైం స్కేలు ఉద్యోగుల జీతాల సమస్య పరిష్కారమైంది.అయిదేళ్ల పైబడి జీతాల కోసం ప్రభుత్వాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పంచాయతీ టైం స్కేల్ ఉద్యోగాలు వేడుకుంటున్నారు. చివరికి ఈ ఏడాది అక్టోబర్ 22న ఆర్థిక శాఖ 020 హెడ్ ద్వారా జీతాలు ఇవ్వడానికి 850 జీవో ఇచ్చింది. అయినప్పటికీ ఈ సమస్య పరిష్కారం కాలేదు.ఎందుకంటే గ్రామ పంచాయతీ ఉద్యోగాలకు సంబంధించి 020 హెడ్ ద్వారా జీతాలు తీసుకునేవారు ఇప్పటి వరకూ లేనందున ఆ హెడ్ ద్వారా జీతాలు తీసుకోవడానికి వీలుపడలేదు.దీంతో ప్రత్యేకంగా మళ్లీ ఆ హెడ్ కోసం రాష్ట్ర గ్రామ పంచాయతీ ఉద్యోగ సంఘం ప్రతినిధులు వై.రామస్వామి, ఐ.వెంకటేశ్వరరావు, సిహెచ్. సత్యనారాయణ మూర్తి,కె.పున్నారావు, విజయశ్రీ,నాగబాబు,కె.శ్రీనివాస్,రవీంద్రబాబు, సీతరామాంజనేయులు తదితరులు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో బుధవారం ఈ 020 హెడ్ ను గ్రామపంచాయతీకి వర్తించే విధంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మరో జీవో 2980 ఇచ్చింది.ఆ ప్రకారం గురువారం నుంచి అన్ని మండల పరిషత్ కార్యాలయాలయాల్లో ఈ హెడ్ యాడ్ అయినట్లు ఆ ఉద్యోగ సంఘ నాయకులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 458 మంది ఉద్యోగులకు ఈ జీతాల సమస్య పరిష్కారమైంది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి 93 మంది జూనియర్ అసిస్టెంట్లు, బిల్లు కలెక్టరు, ఇతర క్యాటగిరిలలో పనిచేస్తున్న వార్కి డిసెంబరు నెల నుంచి రెగ్యులర్ ఎంప్లాయిస్ మాదిరిగానే బడ్జెట్‌తో పనిలేకుండా నెలనెలా జీతాలు తీసుకునే అవకాశం ఏర్పడింది.

# నియామక పత్రాలు అందజేత

**గణపవరం:( సిటిజన్ టైమ్స్): డిసెంబర్:18:**

రాష్ట్రంలో అంగన్వాడి కేంద్రాల్లో సహాయకరాళ్ళ ను నియమిస్తూ , ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తాడేపల్లిగూడెం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధి గణపవరం మండలం, మొయ్యేరు, అర్ధవరం, కేశవరం, గణపవరం అంగనవాడి సెంటర్లలో నూతనంగా నియమితులైన వాళ్లకు ఉంగుటూరు డైనమిక్ శాసనసభ్యుల పత్స మట్ల. ధర్మరాజు తన క్యాంపు కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన అభినందించి , అంగన్వాడి కేంద్రాల ద్వారా తల్లి పిల్లల సంక్షేమం, పోషకాహారం, విద్యా కార్యక్రమాల్లో నిబంధనలతో సేవలు అందించాలని సూచించారు. అదేవిధంగా పెంటపాడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి కూడా పాల్గొన్నారు.



# మౌలిక వసతుల కలపనే ప్రభుత్వ ధ్యేయం -ఎమ్మెల్యే దేవ





**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, డిసెంబర్ 18**

కోనసీమ జిల్లా, రాజోలు నియోజకవర్గం లో దాదాపు 1650 కోట్ల సెంట్రల్ డెల్టా వాటర్ గ్రిడ్ మంచినీటి సరఫరాలో భాగంగా సఖినేటిపల్లిలంక పాటిలంక/చింతావారిపేటలో 20 వేల లీటర్ల వాటర్ ట్యాంకు నిర్మాణానికి రాజోలు శాసనసభ్యులు దేవ వరప్రసాద్ శంకుస్థాపన చేశారు. వాటర్ గ్రిడ్ లో భాగంగా శృంగవరప్పాడు పాటివారి గ్రూపు సత్తెమ్మ గుడి దగ్గర 20 వేల లీటర్ల వాటర్ ట్యాంకును, సఖినేటిపల్లి పాటి లంకలో 20 వేల లీటర్ల వాటర్ ట్యాంక్ కు శంకుస్థాపన చేశారు. శాసన సభ్యులు మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ చేయమని మౌలిక వసతుల ల్పనకు మొదటి ప్రాధాన్యతను ఇస్తున్నట్లు, మంచినీరు,కరెంట్, రోడ్లు, పారిశుధ్యం దృష్టి సారిస్తున్నట్లు, గడిచిన ఏడాదిన్నర కాలంలో చాల వరకు పనులు పూర్తి చేశాం అని, వచ్చే ఏడాదిన్నర లో పూర్తి స్థాయిలో పనులు పూర్తి చేస్తాం అని హామీ ఇచ్చారు. డంపింగ్ యార్డులు విషయంలో పంచాయతీ లు క్లస్టర్ గా ఏర్పడి తగు స్థలాన్ని సమకూర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్క్ పెడ్ డైరక్టర్ జి పెదకాపు, ఎంపీపీ మల్లిబాబు, సర్పంచ్ రేవూరి రాజేశ్వరి ఏసు, తాడి మోహన్, బీజేపీ నాయకులు మలే నగేష్ శ్రీనివాసు, ఎన్డీఏ కూటమి నాయకులు, అధికారులు, పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు కు ఎకనామిక్ టైమ్స్ అవార్డు గర్వకారణం

### గిద్దలూరు ఎమ్మెల్యే శ్రీ ముత్తుమల అశోక్ రెడ్డి

**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు ది ఎకనామిక్ టైమ్స్ ప్రతిష్టాత్మకమైన 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ - 2025' అవార్డును ప్రకటించడం గర్వకారణమని ఎమ్మెల్యే ముత్తుమల అశోక్ రెడ్డి అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ గత 18 నెలల్లో రాష్ట్రా నికి దాదాపు రూ.10.7 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించి రికార్డు సృష్టించారని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి నిజమైన సీఈఓ పాలనలో వేగం, పారదర్శకత, టెక్నాలజీని జోడించి ఒరిజినల్ సీఈఓ ముఖ్యమంత్రిగా తన ప్రత్యేకతను మరోసారి చాటుకున్నారని తెలిపారు. రాష్ట్ర రాజధాని నగరంగా అభివృద్ధి చెందుతున్న అమరావతిని ఉద్యోగాల కల్పనకు నిలయంగా మార్చడమే లక్ష్యంగా ఆయన సాగిస్తున్న ప్రస్థానానికి దక్కిన గౌరవంగా ఈ అవార్డు నిలుస్తుందన్నారు. ఈ అవార్డుఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి, అభివృద్ధికి దక్కిన గుర్తింపుగా, తెలుగు ప్రజలకు, తెలుగుజాతికి దక్కిన గౌరవంగా నిలుస్తుందని ముత్తుమల అశోక్ రెడ్డి పేర్కొన్నారు.

## లేఅవుట్లు భవన నిర్మాణాల అనుమతులపై అవగాహన

**కొమరోలు, సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

లేఅవుట్లు భవన నిర్మాణాల అనుమతుల పై జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్, జూమ్ సమావేశాలకు మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. ఓఎన్ యు డి ఏ వారు నిర్వహించిన లే అవుట్ ల అనుమతి, భవన నిర్మాణాల అనుమతులపై గురువారం వీడియో కాన్ఫరెన్స్, జూమ్ సమావేశం నిర్వహించారు .ఆ సందర్భంగా కొమరోలు లోని మండల పరిషత్ సమావేశంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ జూమ్ సమావేశాలకు ఎంపీడీవో సత్యం, డిప్యూటీ ఎంపీడీవోలు చెన్నారావు, ప్రసాద్, మండలంలోని పంచాయతీ అభివృద్ధి అధికారులు హాజరై వీక్షించారు. ఆ సందర్భంగా జిల్లా స్థాయి అధికారులు తెలిపిన వివరాలపై మండల స్థాయి అధికారులు అవగాహన పెంచుకొని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు లేఅవుట్ల అనుమతి భవన నిర్మాణాల అనుమతుల మంజూరు కు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు.

# మండపేటలో ఘనంగా పెన్షనర్స్ డే...



**కపిలేశ్వరపురం సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

ప్రభుత్వ ఉద్యోగాలు నిర్వహించి పదవీవిరమణ చేసి పెన్షనర్స్ గా ఉన్న వారి అనుభవాలు సమాజానికి అవసరమని మండపేట పుర పాలక సంఘం చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి పేర్కొన్నారు. డి. ఎస్. నకార జయంతి సందర్భంగా మండపేట టౌన్, గ్రామీణ ప్రాంతాలలో నివసించే పెన్షనర్స్ లు పెన్షనర్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. నకారాజయంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం కు పెన్షనర్స్ అధ్యక్షులు దేవళ్ల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. పెన్షనర్స్ కి సంబంధించి సమస్యలు ఉంటే తమ అసోసియేషన్ దృష్టికి తీసుకువస్తే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని తెలిపారు. ముఖ్య అతిథిగా మునిసిపల్ చైర్ పర్సన్ నూక దుర్గారాణి పాల్గొని మాట్లాడుతూ పెర్షనర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. వారి అనుభవాలను ప్రస్తుత సమాజానికి అందించాలని కోరారు. ఆలమూరు సబ్ ట్రెజరీ ఆఫీసర్ సుజాత మాట్లాడుతూ పెన్షనర్స్ కు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే వేగంగా పరిష్కరిస్తానని పేర్కొన్నారు. లైఫ్ సర్టిఫికెట్స్ ఎలా అప్లై చేయాలనే విషయాలు వివరించారు. ఈ కార్యక్రమంలో 75 సంవత్సరములు పూర్తి చేసుకున్న పెర్షనర్స్ ను అసోసియేషన్ తరపున సత్కరించారు .సెక్రటరీ పినిపే గోవిందరాజు మాట్లాడుతూ వార్షిక నివేదికను వివరించారు. భారత దేశంలో పనిచేసిన ప్రభుత్వ ఉద్యోగులు అందరికీ పెన్షన్ రావటానికి కారకులు డి ఎస్ నకారా అని పేర్కొన్నారు. గౌరవ అధ్యక్షులు నేమాని భాస్కరరావు వైస్ ప్రెసిడెంట్ గంటి వీర్రాజు,విశ్రాంత ప్రధా నో ఉపాధ్యాయులు గెడా శ్రీనివాస్ యె%ళి%ద్రు సత్యనారాయణ,వల్లూరు దొరకయ్య అత్యధికంగా పెర్షనర్స్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పాలనకు ప్రజాదర్బార్ నిదర్శనం




**విజయవాడ:( సిటిజన్ టైమ్స్ ): డిసెంబర్:18:**

ఎంపీ కేశినేని శివనాథ్ ఆదేశాల మేరకు 43వ డివిజన్లో ప్రజా దర్బార్ నిర్వహించడం జరిగింది. సమస్యల పరిష్కారం కోసం భారీగా తరలివచ్చిన ప్రజానీకం. కూటమి ప్రభుత్వ ప్రజాస్వామ్య పాలనకు ప్రజా దర్బార్ నిదర్శనమని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకూడదని ఉద్దేశంతో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న అన్నారు. ఈ ప్రజా దర్బార్ కి అధిక సంఖ్యలో ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు తరలిరావడం జరిగింది. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమం డివిజన్ అధ్యక్షుడు అడ్డూరి కొండలరావు అధ్యక్షతన జరిగింది. ఓటమి నాయకులు ప్రజలతో స్వయంగా మాట్లాడి వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీ పై సంబంధిత శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు కొన్ని అర్జీలు అక్కడే పరిష్కరించడం జరిగింది. ఈ ప్రజా దర్బారులో రేషన్ కార్డు మ్యాపింగ్, కొత్త రేషన్ కార్డు, టిడికో ఇల్లు, ఇంటి స్థలాలు, వితంతు, ఒంటరి మహిళల పెన్షన్లు, దివ్యాంగుల పెన్షన్లు, ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ సమస్యలు, సీనియర్ సిటిజన్ సమస్యలు పై ప్రజలు ఎక్కువగా అర్జీలు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎంపీ ఆదేశాల మేరకు ప్రతివారం పశ్చిమ నియోజకవర్గం లో ఒక్కో డివిజన్లో ప్రజా దర్బార్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వచ్చిన అర్జీలకు, వారం, 15 రోజుల లోపు పరిష్కారం చూపించే దిశగా ఎంపీ కార్యాలయ సిబ్బంది ప్రభుత్వ అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో వచ్చిన అర్జీలను పిజిఆర్ఎస్ ఆన్లైన్ ద్వారా వివిధ శాఖలకు పంపించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొనడం జరిగింది.

## కొనకనమిట్ల ఎంపిడిఓ కార్యాలయాన్ని సందర్శించిన డి.ఎల్.డి.ఓ శ్రీనివాసరెడ్డి



**కొనకనమిట్ల, సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

కొనకనమిట్ల మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం డి.ఎల్.డి.ఓ శ్రీనివాసరెడ్డి సందర్శించి వివిధ శాఖల పనితీరును సమీక్షించారు.ఈ సందర్భంగా మండల పరిషత్ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులు,స్వామిత్వ వెక్టోరైజేషన్,డెవలప్మెంట్ కార్యకలాపాలు, ప్రజలకు అందిస్తున్న సేవలపై సమగ్రంగా పరిశీలన చేపట్టారు.అలాగే గత సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్ను బకాయిలు,ప్రస్తుత సంవత్సర ఇంటి పన్ను వసూళ్లు,అటెండెన్స్ రిజిస్టర్ను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు.అన్ని కార్యక్రమాలు సమర్ధవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఈశ్వరమ్మ,ఈఓపిఆర్డి శ్రీదేవి,సిబ్బంది పాల్గొన్నారు.

## వెలిగండ్లలో నీటి నిల్వలు లేకుండా చర్యలు



**కొనకనమిట్ల, సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

మండలంలోని వెలిగండ్ల గ్రామ పంచాయతీలో పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.గ్రామంలో ఉన్న మంచినీటి ట్యాంకులను శుభ్రపరచి బ్లీచింగ్ చల్లి,క్లోరినేషన్ విధిగా నిర్వహించాలని సూచించారు.అలాగే కొళాయిలను పరిశీలించి ఎక్కడా నీటి నిల్వలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు కాళీ ప్రదేశాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని,ప్రజలు ఆరోగ్యకరమైన జీవన విధానం పాటించాలని సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఈశ్వరమ్మ,ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సృజన జ్యోతి పాల్గొన్నారు.

## ఎస్ఐ వెంకట రమణయ్యని కలిసిన సేఫ్టీ డ్రైవర్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ షేక్షావలి



**పెద్ద దోర్నాల, సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

మండల కేంద్రంలోని ఎస్ఐ యస్. వెంకట రమణయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు.గురువారం నాడు సేఫ్టీ డ్రైవర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు మరియు సేఫ్టీ డ్రైవర్ అధ్యక్షుడు షేక్ షేక్షావలి, నూతన ఎస్ఐ యస్. వెంకట రమణయ్యను పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో షేక్ ఖాదర్ బాషా.షేక్ ఖాదర్ భాష. కన్నా. శ్రీను. మహేష్. మహేష్. మహబూబ్బాషా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గిద్దలూరులో కోతుల దాడి

### - యువకుడికి గాయాలు



**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

గిద్దలూరు పట్టణంలోని గణేష్ నగర్ ఎస్బీఐ బ్యాంకు సమీపంలో కోతుల దాడి చోటుచేసుకుంది. గిద్దలూరు పట్టణానికి చెందిన మల్లేష్ అనే యువకుడిపై అకస్మాత్తుగా కోతులు దాడి చేయడంతో అతడు గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి మల్లేష్ను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. గిద్దలూరు పట్టణంలో కోతుల బెడద రోజురోజుకు పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకుని కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పట్టణవాసులు కోరుతున్నారు.


## మురుగు నీటి డ్రైనేజీలు

# అస్తవ్యస్త పట్టించుకోని అధికారులు









**కపిలేశ్వరపురం సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

మేజర్ పంచాయతీ అయినప్పటికీ గ్రామంలో ఎటువంటి డ్రైనేజీ పూడికతీతకు నోచుకోవడం లేదని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నప్పటికీ అధికారులకు ఎన్నిసార్లు తెలియచేసినా పట్టించుకోవడం లేదు. ఈ నిర్లక్ష్యం అంబేద్కర్ కోనసీమ జిల్లా అంగర గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే అంగర గ్రామ పంచాయతీ జనాభా సుమారు 11వేల మంది జీవిస్తున్నారు. ఈ గ్రామం మేజర్ పంచాయతీ అయినప్పటికీ గ్రామంలో ఎటువైపు చూసిన డ్రైనేజీలు పూడికతో నిండి దుర్వాసనతో గ్రామ ప్రజలు దోమల బెడదతో అనారోగ్యంతో హాస్పిటల్ బారిన పడుతున్నామని అధికారులకు ఎన్నిసార్లు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని తెలిపారు. అంగర గ్రామ పంచాయతీ లో నిధులు ఉన్నప్పటికీ గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం వాడుకునే నిర్ణయం తీసుకోలేక గ్రామ పాలకవర్గం ఏ పనులు చేయలేకపోతున్నామని తెలిపారు. గ్రామంలో చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించే ట్రాక్టర్లు బ్యాటరీలు కూడా దొంగలు దొంగిలించినా అధికారులు పట్టించూకోవడం లేదు. చెత్తను తరలించే ట్రాక్టర్ ట్రక్కులు తుప్పు పట్టి పాడైపోయిన వాటిని రిపేరు చేయించకుండానే చెత్తను దారిపొడవునా కార్చుకుంటూ చెత్తను తరలిస్తున్నారు. గ్రామంలో వీధి దీపాలు పట్టపగలు వెలుగుచున్నాయి. కొన్ని చోట్ల రాత్రి సమయంలో వీధి దీపాలు వెలుగడంలేదని పిర్యాదులు చేసి నెలలు కావస్తున్న అధికారులు పట్టించూకోవడంలేదు అని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా గ్రామంలో జల జీవన్ మిషన్ హర్ ఘర్ జల్ పథకం చేపట్టిన ఇంటింటికి మంచి నీటి సరఫరా కుళాయిలు వేసినప్పటికీ నీరు రాకపోవడం, కొన్ని చోట్ల కుళాయిలు రిపేరు ఉన్నప్పటికీ వాటికి ప్లాస్టిక్ కవర్లు కట్టి దర్శనమిస్తున్నాయి. ఇలా గ్రామంలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, మరియు పాలక వర్గం సభ్యులు గ్రామం పరిశుభ్రత కోసం శ్రద్ధ తీసుకోవాలని గ్రామస్థులు కోరుకున్నారు.

# విద్యార్థుల భవిష్యతే ప్రభుత్వ ధ్యేయం

**పుల్లల చెరువు, సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

విద్యార్థుల భవిష్యతే ప్రభుత్వ ధ్యేయం అని ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు.పుల్లలచెరువు పట్టణంలో అసంపూర్తిగా నిలిచిపోయిన విద్యా వసతి భవనాలను యర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు గురువారం పరిశీలించారు.పట్టణంలో నిర్మాణ దశలోనే నిలిచిపోయిన స్త్రీ శక్తి భవనం, కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వసతి గృహాల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు.హాస్టళ్లలో ప్రస్తుతం ఉన్న వసతులు, మౌలిక సదుపాయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, విద్యార్థులకు నాణ్యమైన భోజనం, తాగునీరు, పరిశుభ్రమైన వసతి, విద్యుత్, మరుగుదొడ్లు, భద్రత వంటి సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని సూచించారు. ముఖ్యంగా బాలికల హాస్టళ్లలో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైన సిబ్బంది నియామకం వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు.పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేసి భవనాలను ప్రారంభించాలని, విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని



నిధుల విడుదల, పనుల పర్యవేక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. విద్యా సంస్థలు సక్రమంగా పనిచేస్తేనే సమాజానికి మేలని, విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. తమ అభిప్రాయాలను తెలియజేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని నాయకులు



హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మరియదాస్, ఎంఈఓ ఇందిరా ప్రసాద్, ఏపిఎం వెంకటయ్య, ఈ వార్డు ఆత్మ నాయుడు, ఎంపీపీ వెంకటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, టిడిపి మండల మాజీ కన్వీనర్ పయ్యావుల ప్రసాద్, మాజీ ఏఎంసి డైరెక్టర్ ఉప్పల హనుమంత్, సొసైటీ డైరెక్టర్ గద్దె వెంకటేశ్వర్లు, గజ్వల్లి భాస్కర్,మండల ఉపాధ్యక్షులు కాయ కోకుల ఇదెమ్మ,అధికారులు, టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఇంటూరిను కలిసిన ముప్పవరపు సుచిత్ర




**కందుకూరు, సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

దివంగత టిడిపి నేత, ముప్పవరపు వీరయ్య చౌదరి సతీమణి సుచిత్రను ప్రకాశం జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా ఇటీవల ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావును ముప్పవరపు సుచిత్ర గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు నామినేటెడ్ పదవి రావడంలో సహకరించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముప్పవరపు వీరయ్య చౌదరితో తనకున్న అనుబంధాన్ని ఇంటూరి నాగేశ్వరరావు గుర్తు చేసుకున్నారు. సుచిత్ర వెంట టంగుటూరు మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ కూడా ఉన్నారు.

# ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు పరామర్శ





**కందుకూరు, సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

వలేటివారిపాలెం మండలంలో విధులు నిర్వహించే ముగ్గురు ఉపాధ్యాయులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు గురువారం ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. కత్తి ఐజాక్ డేవిడ్, నల్లమల్లి కుమార్, ఏలూరు చిన్న బ్రహ్మయ్యల యోగక్షేమాలు విచారించి, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# స్వర్ణ స్వయంకృషి ఆశ్రమంకు వంట సామాగ్రి అందజేత



**కందుకూరు, సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కందుకూరు శాఖ సేవా కార్యక్రమాల్లో భాగంగా కందుకూరు కోవూరు రోడ్డు లోని స్వర్ణ స్వయంకృషి ఆశ్రమంలో వంట సామాగ్రి అవసరమని మానవత సంస్థకు తెలియజేయగా కార్య వర్గం వెంటనే స్పందించి వారికి కావలసిన నిత్యవసర వంట సామాగ్రిని ఏర్పాటు చేసి అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శశిధర్ రెడ్డి, వైస్ చైర్మన్ కోవూరు మాలకొండయ్య, అధ్యక్షులు: గుర్రం చిన్న అల్లూరయ్య, ఉపాధ్యక్షులు మంచిరాజు వెంకట మురళీమోహన్, సెక్రటరీ షేక్ గౌస్ మొహిద్దీన్, డైరెక్టర్ గుమ్మళ్ళ మాల్యాద్రి, పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వర రావు, విశ్రాంత ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఆత్మకూరి చంద్రశేఖర్, ఆశ్రమం ఇన్చార్జి బ్రహ్మారెడ్డి, టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారుల ఎంపికలకు ఆహ్వానం

**ఒంగోలు, సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

దాధర్ అండ్ హవేలినగర్, డామన్ అండ్ దయ్యులో జనవరి 1 నుంచి 10 వరకు జరిగే ఖేలో ఇండియా బీచ్ గేమ్స్ లో పాల్గొనే ఏపీ క్రీడాకారుల ఎంపికలకు ఆహ్వానం పలుకుతున్నట్లు డి.ఎస్.డి.ఒ. జి. రాజరాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. బీచ్ సపక్ తక్ర, బీచ్ వాలీబాల్, బీచ్ కబడ్డీ పోటీలకు ఓపెన్ ఏజ్ కేటగిరీలో పురుషులు, మహిళలు, రాష్ట్ర జిల్లా ఎంపికలను ఈ నెల 19వ తేదీన విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్ సమీపంలో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ట్రయల్స్ ఉదయం 9గంటల నుంచి ప్రారంభమవుతాయని, ఆసక్తి గల క్రీడాకారులు సంబంధిత గుర్తింపు పత్రాలతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ప్రకాశం జిల్లా డి.ఎస్.డి.ఒ. జి. రాజరాజేశ్వరి ఫోన్ నెంబర్:9121106840 సంప్రదించాలని తెలిపారు.

# ఇంటింటా స్వదేశీ - ప్రతి ఇంటా స్వదేశీ

## ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ -బీజేపీ నాయకుల చర్చ

**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**



గిద్దలూరు పట్టణం బిజెపి నాయకులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో "ఇంటింటా స్వదేశీ - ప్రతి ఇంటా స్వదేశీ" నినాదంతో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ కార్యక్రమంపై భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రత్యేకంగా చర్చా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిజెపి జిల్లా జనరల్ సెక్రటరీ, గిద్దలూరు, కనిగిరి అసెంబ్లీల ఇన్చార్జ్ డాక్టర్ జెవి నారాయణ మాట్లాడుతూ దేశీయ ఉత్పత్తుల వినియోగం ద్వారా స్వయం ఉపాధి, చిన్న పరిశ్రమల అభివృద్ధి, స్థానిక వ్యాపారులకు బలం చేకూర్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలపై చర్చించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించిన ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచే కీలక కార్యక్రమమని తెలిపారు. వోకల్ ఫర్ లోకల్ భావనను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రతి కుటుంబం స్వదేశీ వస్తువులనే వినియోగించేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గిద్దలూరు పట్టణంలో స్వదేశీ ఉత్పత్తుల వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహించేందుకు రానున్న రోజుల్లో ఇంటింటా ప్రచారం, వ్యాపారులతో సమావేశాలు, యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని అప్పిశెట్టి ఉదయ్ శంకర్ తెలిపారు. స్వదేశీ వస్తువులు వినియోగించడం ద్వారా దేశ సంపద దేశంలోనే నిలిచి, భారతదేశం నిజమైన అర్థంలో స్వయం సమృద్ధిగా మారుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో గిద్దలూరు బిజెపి టౌన్ వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, జనార్ధన్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, జిల్లా బిజెపి మాజీ అధ్యక్షుడు రామాంజనేయులు, బీజేపీ నాయకులు పోతులూరి,కార్యకర్తలు పాల్గొని ఆత్మనిర్భర్ భారత్ అభియాన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని తీర్మానించారు.

# అన్న క్యాంటీన్ కు మధ్యాహ్నం భోజనానికి వితరణ



**కందుకూరు, సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

పట్టణంలోని అన్న క్యాంటీన్ కు వలేటి ప్రసాదు రాణి దంపతులు తమ కుమార్తె వలేటి జాహ్నవి జన్మదినోత్సవం సందర్భంగా గురువారం మధ్యాహ్నం 275 మందికి భోజన సదుపాయం ఏర్పాటు చేయడానికి ఒక్కో ప్లేటుకు రూ. 34 రూపాయలు చొప్పున రూ. 9350 మున్సిపల్ కమిషనర్ అనూషకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పర్యవేక్షణలో అన్న క్యాంటీన్ పేదలకు నిరంతరాయంగా భోజన సదుపాయాన్ని కల్పించడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో అన్న క్యాంటీన్ పరిశీలకురాలు గుండవరపు లక్ష్మి, మేనేజర్ సన్నీ, హరే రామ హరే కృష్ణ బాధ్యులు మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

# టెన్త్ విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయండి.

**తాటిచెర్లలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ను సందర్శించి సూచనలు, సలహాలు ఇచ్చిన ఎంఈఓ 2 వెంకటరత్నం.**

**కొమరోలు, సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

వచ్చే మార్చిలో నిర్వహించనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని కొమరోలు ఎంఈఓ 2 బొర్ర వెంకటరత్నం ప్రధానోపాధ్యాయులు ,సబ్జెక్టు ఉపాధ్యాయులను కోరారు. కొమరోలు మండలం తాటిచెర్ల లోని జిల్లా పరిషత్ హై స్కూల్ ను వెంకటరత్నం సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు అనంతరం ఆ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల కొరకు నిర్వహిస్తున్న 100 రోజుల ప్రణాళికను ఆయన పరిశీలించారు. ఆ సందర్భంగా స్టడీ అవర్స్ లో ఉన్న విద్యార్థులతో ముచ్చటిస్తూ వారికి సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు వేసి సమాధానాలు స్వీకరించారు. వచ్చే మార్చిలో నిర్వహించనున్న పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించేందుకు పాఠశాలల్లో నిర్వహిస్తున్న వందరోజుల ప్రణాళికను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విద్యార్థులను కోరారు. టెన్త్ విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి రూపొందించిన వందరోజుల ప్రణాళికను విజయవంతం



చేసేందుకు ప్రధానోపాధ్యాయులు సబ్జెక్ట్ ఉపాధ్యాయులు నిరంతర కృషి చేయాలని కోరారు. గత ఏడాది కంటే ఈ ఏడాది టెన్త్ పబ్లిక్ పరీక్షలలో పాఠశాలకు అత్యుత్తమ ఫలితాలు వచ్చే విధంగా ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని ఆయన కోరారు ఆ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సురక్షిత ప్రయాణమే లక్ష్యం

## - విద్యార్థులతో బస్సులో జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి



**కనిగిరి, సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో గురువారం ప్రకాశం జిల్లా రవాణా శాఖాధికారి సత్యనారాయణ విద్యార్థులతో కలిసి ఆర్‌టీసీ బస్సులో ఇర్లపాడు, లక్ష్మక్క పల్లి, లింగన్నపాలెం వెళ్లి అక్కడనుండి తిరుగుప్రయాణంలో బొడ్లగూడూరు, బోడవాడ వరకు విద్యార్థులతో ప్రయాణం చేసి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా నియమాలు వంటి అంశాలపై వివరించారు. చిన్న వయసులోనే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలగడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల లభ్యత, సమయపాలన, భద్రత వంటి అంశాలపై విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకోవడం జరిగింది. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలతో బాగా చదువుకొని చిన్న వయస్సులోనే భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని తెలిపారు. బస్సులో ప్రయాణించే సమయంలో క్రమశిక్షణ పాటించాలని డ్రైవర్‌కు కండక్టర్ కు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించకూడదని సూచించారు. అలాగే భావిభారత పౌరులైన విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు దించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డ్రైవరు కండక్టర్ కు సూచించారు. ఈకార్యక్రమాలు విద్యార్థులకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడంలో, ప్రభుత్వ పథకాలను వారికి చేరవేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో కనిగిరి డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం, అధికారులు, ఆర్‌టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబునాయుడుకు రుణపడి ఉంటాం

## నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జి కందుల రామిరెడ్డి





**తార్లుపాడు, సిటిజన్ టైమ్స్ డిసెంబర్ 18**

మార్కాపురం ప్రత్యేక జిల్లా ప్రకటించడంతో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలియజేశారు. గురువారం తర్లుపాడు మండలం లోని బుడ్డపల్లి గ్రామం లో ఎన్డీఏ కూటమి నాయకులు,గ్రామస్తులు, మహిళలు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డిలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జి కందుల రామిరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ చంద్రబాబు నాయుడుకి రుణపడి ఉంటామని అత్యంత వెనుకబడిన ఈ ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించాలని గతంలో కోరామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాల పునర్విభజన జరిగినప్పుడు ఎంతో వివక్షతో ఈ ప్రాంతాన్ని విస్మరించారని గతంలో హామీ ఇచ్చిన విధంగానే ఇప్పుడు మార్కాపురం జిల్లా ప్రకటించటం చంద్రబాబు నాయుడుకి ఈ ప్రాంత ప్రజలు ఎంతో రుణపడి ఎప్పటికి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



తు మేరీ మెయిన్ తేరా ప్రమోషన్ కోసం పసుపు రంగు లెహంగాలో అనన్య పాండే స్టన్స్

# 2026 లో 1000 కోట్ల తెలుగు సినిమా?



1000 కోట్ల క్లబ్ అన్నది టాలీవుడ్ కి ఇప్పుడు కామన్ గా మారిన పదం. %-%బాహుబలి%-,-% ఆర్ ఆర్ ఆర్%-, -%పుష్ప%-, -%కల్కి 2898%-% లాంటి చిత్రాలు 1000 కోట్లకు పైగా వసూళ్లు సాధించడంతో? ఇండియన్ బాక్సాఫీస్ వద్ద టాలీవుడ్ యావరేజ్ టార్గెట్ 2000 కోట్లగా మారింది. ఎస్ ఎస్ ఎంబీ 29 %-%వారణాసి%-%, బన్నీ 26వ చిత్రాలైతే? అంతకు మించే హైప్ తీసుకొ స్తున్నాయి. రెండు సినిమాల టార్గెట్ 3000 కోట్ల టార్గెట్ గా బరిలోకి దిగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఆ సంగతి పక్కన బెడితే? 2025 లో మాత్రం టాలీవుడ్ నుంచి 1000 కోట్ల వసూళ్ల సినిమా ఒకటీ లేదు.

**సంక్రాంతి తర్వాత అన్నీ చప్పగానే**

రామ్ చరణ్ నటించిన %-%గేమ్ ఛేంజర్%-% భారీ అంచనాల మధ్య పాన్ ఇండియాలో రిలీజ్ అయినా? ఆశించిన ఫలితాలు రాలేదు. ఆ తర్వాత మరే చిత్రం కూడా ఆ రేంజ్ లో రిలీజ్ అవ్వలేదు. చాలా సినిమాలు రీజనల్ మార్కెట్ కే పరిమితమయ్యాయి. వీటిలో పెద్ద విజయం సాధించిన చిత్రమేది? అంటే %-%సంక్రాంతికి వస్తున్నాం%-% ఒకటి కనిపిస్తుంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద 300 కోట్ల వసూళ్లను సాధించింది. ఇదేమీ పాన్ ఇండియా రిలీజ్ కాదు. రీజనల్ మార్కెట్ కే పరిమితమైన చిత్రం. అయినా వెంకీ ఇమేజ్ అనీల్ మార్క్ ఎంటర్ టైనర్ కావడంతో? కనెక్ట్ అయింది.

**ప్రభాస్ రెండు సినిమాలతో:**

మరి 2026 లో టాలీవుడ్ నుంచి 1000 కోట్లు సాధించే సత్తా ఉన్న చిత్రాలేంటి? అంటే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తోన్న %-%పెద్ది%-%పై అంచనాలున్నాయి. మార్చిలో ఈ సినిమా పాన్ ఇండియాలో రిలీజ్ అవుతుంది. అంతకు ముం దే? డార్లింగ్ ప్రభాస్ నటిస్తోన్న %-%ది రాజాసాబ్%-% సంక్రాంతి కానుకగా రిలీజ్ అవుతుంది. మారుతి దర్శకత్వం వహిస్తోన్న సస్పెన్స్ కామెడీ థ్రిల్లర్ ఇది. ప్రభాస్ ఇమేజ్ ని దృష్టిలో పెట్టుకుని పాన్ ఇండియాలో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారు. ఇప్పటికే ప్రచారం పనులు కూడా మొదలు పెట్టిన సంగతి తెలిసిందే.

**పెద్ది, పౌజీపై అంచనాలు:**

మరి ఈ సినిమా 1000 కోట్ల పోటీ బరిలో ఉందా? అంటే ఇప్పుడే చెప్పలేం. నార్త్ ఆడియన్స్ కు కంటెంట్ కనెక్ట్ అవ్వడాన్ని బట్టి ఉంటుంది. %-%పుష్ప%-%లా కనెక్ట్ అయిందంటే? మాత్రం వసూళ్లతో బాక్సాఫీస్ మోతెక్కడం ఖాయం. అదే ఏడాది ప్రభాస్ నటిస్తోన్న %-%పౌజీ%-% కూడా ప్రేక్షకుల ముందుకు రానుంది. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తో న్న చిత్రమిది. ఇదోక పీరియాడిక్ యాక్షన్ చిత్రం కావడంతో? ఇండియా వైడ్ అంచనాలైతే భారీగా ఉన్నాయి.%-%పెద్ది%-%ని మించిన అంచనాలు %-%పౌజీ%-%పై ఉన్నాయి.

**గత గణాంకాలు ఆధారంగా:**


యూనివర్శల్ కాన్సెప్ట్ కావడంతో? బజ్ నెలకొంది. భారీ వార్ కథలోనే ఓ బ్యూటీఫుల్ లవ్ స్టోరీని కూడా తీసుకు న్నాడు. %-%సీతారామం%-% లాంటి పాన్ ఇండియా సక్సెస్ కూడా హను ఖాతాలో ఉన్న నేపథ్యంలో అంచనాలు రెట్టింపు అవుతు న్నాయి. అయితే టాలీవుడ్ నుంచి రిలీజ్ అవుతోన్న ఏ పాన్ ఇండియా సినిమా అయినా? నార్త్ బెల్ట్ నుంచి కచ్చితంగా 200 కోట్లకు పైగా వసూళ్లను రాబడితే? 1000 కోట్ల క్లబ్ అన్నది సాధ్యమని గత సినిమా గణాంకాలు చెబుతున్నాయి.



ఎమరాల్డ్ గ్రీన్ లెహంగాలో పాలక్ తివారీ అబ్బురపరిచాడు

## సత్తా చాటడానికి సరైన సమయం: గిల్‌కు చెక్.. ఐదో టీ20లో ఓపెనర్‌గా శాంసన్





టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ ఎట్టకేలకు చాలా రోజుల తర్వాత టీమిండియా ప్లేయింగ్ 11లో చోటు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. గిల్ రాకతో మిడిల్ ఆర్డర్ కు పడిపోయిన శాంసన్.. ఆ తర్వాత జితేష్ శర్మ రాకతో ప్లేయింగ్ 11లో చోటు కోల్పోయాడు. జట్టులో రిజర్వ్ ఓపెనర్.. రిజర్వ్ వికెట్ కీపర్ గా సంజును టీమిండియా యాజమాన్యం కొనసాగిస్తోంది. సౌతాఫ్రికాతో జరగనున్న ఐదో టీ20 కోసం టీమిండియా తుది జట్టులో సంజు శాంసన్ ఓపెనర్ గా బరిలోకి దిగడం ఖయాంగా మారింది. గిల్ గాయం కారణంగా తప్పుకోవడంతో అభిషేక్ శర్మతో ఇన్నింగ్స్ ఆరంభించనున్నాడు.

సౌతాఫ్రికాతో నాలుగో టీ20కి ముందు టీమిండియా ఓపెనర్ శుభమాన్ గిల్ గాయం కారణంగా దూరమయ్యాడు. బుధవారం (డిసెంబర్ 17) లక్నో వేదికగా ఏకనా క్రికెట్ స్టేడియంలో మ్యాచ్ ప్రారంభానికి ముందు నెట్స్ లో ప్రాక్టీస్ చేస్తుండగా గిల్ పాదానికి గాయమైంది. దీంతో నాలుగో టీ20 మ్యాచ్ కు దూరమయ్యాడు. ఈ మ్యాచ్ పొగమంచు కారణంగా రద్దయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం టీమిండియా శుక్రవారం (డిసెంబర్ 19) జరగబోయే చివరిదైన ఐదో టీ20 కోసం సిద్ధమవుతోంది. నాలుగో టీ20.. ఐదో టీ20 మ్యాచ్ కు ఒక రోజు మాత్రమే గ్యాప్ ఉండడంతో గిల్ కోలుకోవడం కష్టంగానే కనిపిస్తోంది.

గిల్ స్థానంలో సంజు శాంసన్ ప్లేయింగ్ 11లోకి రావడం ఖాయమైంది. ఫామ్ లో లేని గిల్ ఈ మ్యాచ్ కు దూరం కావడంతో టీమిండియాకు ఎదురు దెబ్బ తగిలింది. గిల్ గాయంపై బీసీసీఐ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. టీ20 వరల్డ్ కప్ ముందు గిల్ ను మ్యాచ్ ఆడించి రిస్క్ చేయాలనే ఆలోచనలో బీసీసీఐ లేదు. చివరి టీ20కి గిల్ కు రెస్ట్ ఇవ్వనున్నట్టు సమాచారం. అదే జరిగితే ఓపెనర్ గా సంజు శాంసన్ నిరూపించుకోవడానికి ఇదే సరైనసమయం. ఆస్ట్రేలియాతో రెండో టీ20 తర్వాత ప్లేయింగ్ 11లో చోటు లేకుండా బెంచ్ కే పరిమితమైన శాంసన్ కు ఇది గోల్డెన్ ఛాన్స్ అనే చెప్పాలి.ఈ మ్యాచ్ లో సంజు భారీ ఇన్నింగ్స్ ఆడితే అతడిని జట్టు నుంచి తప్పించలేని పరిస్థితి. కొంతకాలంగా ఫామ్ లో లేకపోయినా గిల్ ను జట్టులో కొనసాగిస్తున్నారని సోషల్ మీడియాలో శుభమాన్ పై విమర్శలు చేస్తున్నారు. గిల్ ను తప్పించి శాంసన్ కు అవకాశం ఇవ్వాలనే డిమాండ్స్ వినిపించాయి. గిల్ కు దురదృష్టవశాత్తు గాయం కావడంతో శాంసన్ కు లైన్ క్లియర్ అయింది. మరి శాంసన్ వచ్చిన అవకాశాన్ని ఎలా వినియోగించుకుంటాడో చూడాలి.

**నాలుగో టీ20 రద్దు:**

దట్టమైన పొగమంచు కారణంగా.. ఇండియా, సౌతాఫ్రికా మధ్య బుధవారం జరగాల్సిన నాలుగో టీ20 మ్యాచ్ రద్దయింది. సాయంత్రం నుంచే స్టేడియం మొత్తాన్ని పొగమంచు ఆవరించి ఉండ5టంతో విజిబిలిటీ గణనీయంగా తగ్గిపోయింది. దాంతో టాస్ వేయడాన్ని ఆలస్యం చేశారు. అక్కడి నుంచి ప్రతి అర్ధ గంటకు ఒకసారి అంపైర్లు గ్రౌండ్‌ను పరిశీలించారు. విజిబిలిటీ మెరుగుపడితే తక్కువ ఓవర్ల మ్యాచ్‌నైనా ఆడించేందుకు ప్రయత్నించారు. కానీ వాతావరణంలో ఎలాంటి మార్పు కనిపించలేదు. 9.30 గంటలకు ఆరోసారి మైదానాన్ని పరిశీలించిన అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

## పొగమంచుతో లక్నో టీ20 రద్దు...టికెట్ల డబ్బు రిఫండ్ చేస్తున్న యూపీసీఏ

**పొగమంచు కారణంగా రద్దయిన భారత్-సౌతాఫ్రికా నాలుగో టీ20**

**ప్రేక్షకులకు టికెట్ డబ్బులు తిరిగి ఇస్తామని యూపీ క్రికెట్ సంఘం ప్రకటన**

**శుక్రవారం నుంచి రిఫండ్ ప్రక్రియ షురూ**

**ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కొన్నవారికి వేర్వేరుగా ఏర్పాట్లు**

**ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1 ఆధిక్యంలో ఉన్న భారత్**




భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరగాల్సిన నాలుగో టీ20 మ్యాచ్ దట్టమైన పొగమంచు కారణంగా రద్దవడం తెలిసిందే. లక్నోలోని ఏకానా క్రికెట్ స్టేడియంలో గురువారం రాత్రి జరగాల్సిన ఈ మ్యాచ్‌కు మంచు కారణంగా వెలుతురు సరిగా లేకపోవడంతో అంపైర్లు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో, మ్యాచ్ కోసం టికెట్లు కొనుగోలు చేసిన ప్రేక్షకులకు పూర్తి డబ్బులు తిరిగి ఇస్తామని ఉత్తరప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ (యూపీసీఏ) కార్యదర్శి ప్రేమ్ మనోహర్ గుప్తా స్పష్టం చేశారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ, "టికెట్ల రిఫండ్ ప్రక్రియ శుక్రవారం ఉదయం నుంచి ప్రారంభమవుతుంది. ఆన్‌లైన్‌లో టికెట్లు కొన్నవారికి ఆన్‌లైన్‌లోనే డబ్బులు వాపస్ వస్తాయి. కేవలం సర్వీస్ ఛార్జీలు మాత్రమే మినహాయించుకొని మిగతా మొత్తం రిఫండ్ చేస్తాం. ఆఫ్‌లైన్‌లో టికెట్లు కొన్నవారి కోసం ఏకానా స్టేడియంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. దీనికి సంబంధించి వార్తాపత్రికల్లో న ప్రకటన కూడా ఇస్తాం" అని వివరించారు. గురువారం రాత్రి అంపైర్లు కేఎన్ అనంతపద్మనాభన్, రోహన్ పండిట్ మైదానాన్ని పలుమార్లు పరిశీలించిన అనంతరం, పరిస్థితి అనుకూలంగా లేకపోవడంతో, మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో గుప్తా స్పందిస్తూ "మ్యాచ్ జరగనందుకు చాలా చింతిస్తున్నాం. ఎంతో ఆశతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. వారి సమయం వృథా అయినందుకు క్షమాపణలు కోరుతున్నాం" అని గుప్తా అన్నారు. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారత జట్టు ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ప్రస్తుతం 2-1 ఆధిక్యంలో ఉంది. చివరిదైన ఐదో టీ20 మ్యాచ్ శుక్రవారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరగనుంది.

## యాషెస్‌లో షాకిస్తున్న 'స్నికో' టెక్నాలజీ వివాదం.. క్లియర్ నాటౌట్ అయితే ఎలా ఔటిస్తారు..




ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న యాషెస్ మూడో టెస్టులో ఘోరమైన తప్పిదాలు చోటు చేసుకున్నాయి. DRS విషయంలో తీవ్ర వివాదం నడుస్తోంది. మ్యాచ్ సమయంలో ఆస్ట్రేలియా DRS ఆపరేటర్స్ పై నెటిజన్స్ తీవ్ర విమర్శలు చేస్తున్నారు. యాషెస్ రెండో రోజు ఆటలో భాగంగా ఇంగ్లాండ్ వికెట్ కీపర్ బ్యాటర్ జెమీ స్మిత్ ఔట్ కు అన్యాయం జరిగింది. క్లియర్ నాటౌట్ అయినప్పటికీ ఆస్ట్రేలియా స్నికోలో ఔటని చూపించడం షాకింగ్ మారింది. రెండో రోజు కమ్మిన్స్ బౌలింగ్ లో స్మిత్ పుల్ షాట్ ఆడేందుకు ప్రయత్నించాడు. షాట్ మిస్ కావడంతో బంతి వెళ్లి వికెట్ కీపర్ చేతుల్లో పడింది. బంతి బ్యాట్ కు తగిలిందేమో అని ఆస్ట్రేలియా DRS కోరారు. రీప్లేలలో బ్యాట్, బంతి మధ్య భారీ అంతరం కనిపించినప్పటికీ స్నికోమీటర్ స్పైక్‌ను చూపించింది. దీంతో థర్డ్ అంపైర్ స్మిత్ ను ఔట్ ప్రకటించాడు. స్మిత్ ఔట్ తీవ్ర వివాదానికి దారి తీస్తోంది. స్మిత్ ఔట్ అని ప్రకటించడంతో ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా జట్లు తీవ్ర నిరాశకు గురయ్యాయి. ఆస్ట్రేలియాలో టెక్నాలజీ దారుణంగా ఉందని ఇంగ్లాండ్ ఫ్యాన్స్ మండిపడుతున్నారు. మినిమమ్ కామన్ సెన్స్ లేకుండా ఔట్ అని ఎలా ప్రకటిస్తారు అని ఫైరవుతున్నారు.అంతకముందు తొలి రోజు ఆటలో భాగంగా ఇంగ్లాండ్ పై సెంచరీ చేసి జోరు మీదున్న ఆస్ట్రేలియా వికెట్ కీపర్ థర్డ్ అంపైర్ తప్పిదం కారణంగా పెవిలియన్ కు చేరాడు. మిచెల్ స్టార్క్ స్నికోను తొలగించాలని.. అది ఇప్పటివరకు చెత్త టెక్నాలజీ అని చెప్పడం స్టంప్ మైక్ లో వినిపించింది. మరోవైపు ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ అంపైర్ నిర్ణయాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డెసిషన్ రివ్యూ సిస్టమ్ ఘోరంగా ఉందని విచారం వ్యక్తం చేశాడు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 377 పరుగులకు ఆలౌటైంది. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లాండ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 8 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776